నమ్మలేని నిజాలు

శూన్య షికారు
నవ మాసాల కాలం
సునీత ఖ్యాతి.
సునీత తార
దివినుండి భువికి
గగన దారి.
చూస్తే డబ్బులు
ఖరీదైన కుక్కలు
లాభ వర్తకంఖ.

కలలు దగ్ధం
స్వార్ధరాగాగ్ని జ్వాల
యువత పోరు.

మంత్రి పాపాలు
బడుగుల శాపాలు
కూలే రాజ్యాలు.



- రేడియమ్
సెల్: 9291527757

# నేటి నిజం
తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

శ్రీనిజాలు

ఇంతంట్లో లేనట్లే
మంత్రి వర్గ విస్తరణ !
అధిష్టాన నిర్ణయమే
రేవంత్ రెడ్డి వివరణ !
పార్టీలైను దాటితే
దక్కదండి పదవి !
అంతా రికార్డవుతుంది
విప్పకండి పెదవి !



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

హైదరాబాద్ గురువారం 17-4-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:202 పేజీలు:6 వెల: రూ.1/-


# ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది.. మంత్రి పొన్నం



కరీంనగర్, ఏప్రిల్ 16: సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇప్పుడు కూడా ఇస్తామని, ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం హుస్నాబాద్ నియోజకవర్గంలోని సైదాపూర్ మండల కేంద్రంలో కళ్యాణ లక్ష్మి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు లక్షా 116 చొప్పున 60మందికి చెక్కులు అందజేశారు. అనంతరం సైదాపూర్‌లో విశాల సహకార పరపతి సంఘం సైదాపూర్ లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్, సైదాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్, విశాల సహకార పరపతి సంఘం మండల అధ్యక్షులు కొత్త తిరుపతి రెడ్డి, ఆర్డీవో రమేష్ పాల్గొన్నారు.

## ఎవరు బయట అమ్మొద్దు..

సన్న వడ్లు ఎవరూ బయట అమ్మొద్దని మంత్రి పొన్నం అన్నారు. ఒకటో తేదీ పోతారం గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. ఎక్కడైనా అవసరముంటే అదనంగా వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తామన్నారు. గత పంటకు సంబంధించిన సన్న వడ్లకు బోనస్ పెండింగ్ బిల్లులు లేవని, ఒకవేళ ఎవరికైనా పేమెంట్ కాకపోతే జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అవే వడ్లు సన్న బియ్యం రూపంలో మనకు వస్తున్నాయని చెప్పారు. దేశంలోనే మొదటి సారి తెలంగాణ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుందన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కి గ్యాస్ అందిస్తున్నామన్నారు. రైతులకు రుణమాఫీ పూర్తి చేశామన్నారు. 168 కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశామన్నారు. ధాన్యం కొనుగోలులో ఎక్కడా అదనపు తూకం ఉండదని స్పష్టం చేశారు. రైతులకు ఏ కష్టం రాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## సన్న బియ్యం పంపిణీ అద్భుతమైన పథకం..

సన్న బియ్యం పంపిణీ అద్భుతమైన పథకమని మంత్రి పొన్నం అన్నారు. తమ పైసలతో అంటున్న కేంద్ర ప్రభుత్వం మరి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సన్న బియ్యం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. గురుకుల పిల్లలకు మెస్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీలు పెంచినట్లు చెప్పారు. నీళ్ల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, ఒకవేళ నీటి కొరత ఉంటే చెప్పాలన్నారు.

## ధరణి స్థానంలో భూ భారతి చట్టం..

ధరణి స్థానంలో భూభారతి చట్టం తీసుకువచ్చామని మంత్రి పొన్నం తెలిపారు. రెవెన్యూ పరమైన భూపంచాయితీ ఉండదని, భూమి అంటే ఆత్మగౌరవం అలాంటి పంచాయితీలు ఇక ఉండవని చెప్పారు. అలాగే ఎస్సీ వర్గీకరణపై చారిత్రక నిర్ణయం తీసుకున్నామని, దేశంలోనే మొదటిసారి చట్టం తెచ్చామని చెప్పారు. బీసీ కులగణన చేశామని, రిజర్వేషన్ల పెంపు చట్టం తెచ్చామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని, ఇందులో రాజకీయ జోక్యం ఉండదన్నారు.

# ఎమ్మెల్సీగా దాసోజు శ్రవణ్ ప్రమాణ స్వీకారం



హైదరాబాద్, ఏప్రిల్ 16:ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన దాసోజు శ్రవణ్ కుమార్ ఈరోజు శాసనమండలిలో ప్రమాణ స్వీకారం చేశారు.

చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిధులుగా హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు, మాజీ మంత్రులు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు దాసోజు శ్రావణ్ కుమార్ కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నాగారకుంట నవీన్ కుమార్ రెడ్డి దాసోజు శ్రవణ్ కుమార్ కి శుభాకాంక్షలు తెలియజేస్తూ శాసనమండలిలో ప్రజా ప్రయోజనాల కోసం కలిసి పనిచేద్దామని శుభాకాంక్షలు తెలియజేశారు.

# సింగరేణి విశ్వవ్యాప్త విస్తరణకు నైనీ గని తొలిమెట్టు

**-ప్రజాపాలనలో ఇతర రాష్ట్రాలకు విస్తరించిన సింగరేణి**
**-ఒడిశాలో సింగరేణి గని ప్రారంభం.. తెలంగాణకే గర్వకారణం**
**-13 దశాబ్దాల చరిత్రలో నైనీ గని ఒక సువర్ణాధ్యాయం**
**-నైనీ గనిని వర్చువల్‌గా ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



హైదరాబాద్, ఏప్రిల్ 16: సింగరేణి సంస్థ తన 136 సంవత్సరాల సుదీర్ఘ చరిత్రలో తొలిసారిగా ఇతర రాష్ట్రంలో బొగ్గు గని ప్రారంభించుకోవడం ఒక సువర్ణ అధ్యాయమని, ఒడిశా లో నైనీ గని ప్రారంభంతో సింగరేణి తన విశ్వవ్యాప్త విస్తరణకు శ్రీకారం చుట్టిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మహాత్మా జ్యోతి రావ్ ఫూలే ప్రజా భవన్ నుంచి నేడు ఆయన ఒడిశా రాష్ట్రంలో సింగరేణి చేపట్టిన నైనీ బొగ్గు బ్లాక్ ను వర్చువల్ గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒడిశాలో గని ప్రారంభించడం సింగరేణి సంస్థ కే కాకుండా యావత్తు తెలంగాణ రాష్ట్రానికి ఒక గర్వకారణ మన్నారు. ఈ బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించి తొమ్మిది ఏళ్లు వివిధ కారణాల రీత్యా ప్రారంభానికి నోచుకోలేదని చెప్పారు.

## ప్రజాప్రభుత్వం కృషితో..

ఏడాది క్రితం ప్రజా ప్రభుత్వం కొలువు దీరిన వెంటనే ముఖ్యమంత్రి .రేవంత్ రెడ్డి, తాను కేంద్ర బొగ్గు శాఖ మంత్రిని పలుమార్లు కలిసి పూర్తి అనుమతులకు సానుకూలత సాధించామన్నారు. ప్రజా ప్రభుత్వం చూపిన ప్రత్యేక చొరవ వల్లే ఏడాదిలోనే దీనిని ప్రారంభించుకోగలిగామన్నారు. దీంతో ప్రజా ప్రభుత్వానికి సింగరేణి అభివృద్ధిపై ఉన్న నిబద్ధతను తెలియజేస్తుందని పేర్కొన్నారు. ఒడిశాలో ప్రారంభించిన నైనీ బొగ్గు బ్లాకు సింగరేణి విస్తరణలో ఒక తొలి అడుగు గా ఆయన అభివర్ణించారు. ఇక్కడి నుండి ఇతర రాష్ట్రాలకు ఇతర దేశాలకు కూడా సింగరేణి విస్తరిస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. త్వరలో సింగరేణి గ్లోబల్ కంపెనీగా రూపుదిద్దుకోనుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నైనీ గని ప్రారంభానికి సహకరించిన కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డికి, ఒడిశా ప్రాంతానికి చెందిన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీకి, స్థానిక ఎమ్మెల్యే అగస్తీ బెహారా, ఇతర ప్రజాప్రతినిధులకు తన ధన్యవాదాలు తెలిపారు.

అంగూల్ అభివృద్ధి కి పూర్తి కృషి

గత ఏడాది జులైలో తాను ఒడిశా పర్యటన సందర్భంగా అంగూల్ ప్రాంత అభివృద్ధికి ఇచ్చిన ప్రతీ హామీని త్వరలోనే సింగరేణి సంస్థ అమలు జరుపుతుందని, ఆ ప్రాంత సర్వతో ముఖాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని భట్టి అన్నారు. సింగరేణి ప్రభుత్వ రంగ సంస్థ అని, కేవలం వాణిజ్యం కోసం పనిచేసే కంపెనీ కాదని, సామాజిక స్పృహతో ఇక్కడ కార్యక్రమాలు చేపడతామని భరోసా ఇచ్చారు.

అంగూల్ ప్రాంత ప్రజల ఉపాధి అవకాశాలు మరింతగా మెరుగుపరచడం కోసం 1600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని కూడా నైనీకి సమీపంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, దీనికి సంబంధించిన స్థల సేకరణకు ఒడిశా ప్రభుత్వం సహకరించాల్సిందిగా కోరారు. ఇతర రాష్ట్రంలో తొలిసారిగా బొగ్గు తవ్వకం ప్రారంభించిన సింగరేణి, ఈ గనిని ఆదర్శప్రాయంగా నిర్వహించాలని కోరారు.

## ఒడిశాలో బొగ్గు గని ప్రారంభించడం చరిత్రాత్మకం

ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా మాట్లాడుతూ ఒడిశాలో సింగరేణి బొగ్గు గని ప్రారంభించడం ఒక చరిత్రాత్మక సందర్భమని, ఇది సింగరేణి అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు.

స్థానిక ఎమ్మెల్యే అగస్తి బెహరా ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ తమ ప్రాంతంలో సింగరేణి బొగ్గు గని ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. ఈ గనికి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. అంగూల్ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తమ రాష్ట్రంలో బొగ్గు గని ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కి, సింగరేణి సీఎండీకి శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం, డిప్యూటీ సీఎం చొరవతో?

నైనీ నుంచి ప్రారంభోత్సవ సభకు అధ్యక్షత వహించిన సింగరేణి సంస్థ సీఎండీ ఎన్. బలరామ్ మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి చూపిన ప్రత్యేక చొరవ, సహకారం వల్ల నైనీ బొగ్గు బ్లాక్ ను ఈ రోజు ప్రారంభించుకో గలిగామన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వ మార్గ నిర్దేశంలో థర్మల్ పవర్ ప్లాంట్‌ను కూడా ప్రారంభిస్తామని, మరిన్ని అభివృద్ధి, విస్తరణ కార్యక్రమాలను విజయవంతంగా చేపడతామన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రజా భవన్ నుంచి ట్రాన్స్ కో సీఎండీ కృష్ణ భాస్కర్, ఓఎస్డీ సురేందర్ రెడ్డి, సింగరేణి ఈడీ(కోల్ మూవెంట్) ఎస్డి.ఎం.సుభానీ పాల్గొనగా.. నైనీ నుంచి సంస్థ డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, నైనీ జీఎం టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టు తదుపరి చీఫ్ జస్టిస్‌గా గవాయ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: సుప్రీంకోర్టు తదుపరి చీఫ్ జస్టిస్‌గా గవాయ్ బాధ్యతలు స్వీకరించనున్నారు.. ప్రస్తుతం సుప్రీం కోర్టులో న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్న జస్టిస్ గవాయ్ పేరును కొలీజియం సిఫార్సు చేయడంతో ఆయన సిజెగా మే 14 వ తేదిన ప్రమాణ స్వీకారం చేయనున్నారు.. ప్రస్తుతం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా మే 13న పదవీ విరమణ చేయనున్నారు.

# డ్రగ్స్ కలకలం.. పట్టుబడిన మాజీ సీఎస్ కుమారుడు

హైదరాబాద్, ఏప్రిల్ 16:రాష్ట్రంలో డ్రగ్స్ అక్రమ రవాణాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. తెలంగాణలో మత్తు పదర్థాల మాటే వినపకుండా చేయాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో డ్రగ్స్ విక్రయిస్తున్న వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తోంది. టాస్క్‌ఫోర్స్, ఎస్ఓటీ, నార్కోటిక్ బ్యూరో సిబ్బంది రాష్ట్రంలోనే విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు.

ఈ క్రమంలోనే డ్రగ్స్ అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం అందుకున్న పోలీసులు, ఎస్వోటీ టీం గచ్చిబౌలిలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. అనంతరం శరత్ సిటీ మాల్ దగ్గర అనుమానాస్పదంగా తిరుగుతున్న యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు అతడి నుంచి భారీగా డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. అయితే, డ్రగ్స్‌తో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన ఆ యువకుడు ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓ మాజీ సీఎస్ కుమారుడని ప్రాథమికంగా తెలుస్తోంది. అయితే, టాస్క్‌ఫోర్స్ టీమ్ నిందితుడిని అదుపులోకి తీసుకునేందుకు యత్నించగా వారితో వాగ్వాదానికి దిగినట్లుగా సమాచారం. అతను డ్రగ్స్ ఎక్కడి నుంచి నగరానికి తీసుకొచ్చాడు. ఎవరికి హ్యాండోవర్ చేయాలనుకున్నాడనే విషయాలపై పోలీసులు విచారిస్తున్నారు. నిందితుడు ఉత్తర్ ప్రదేశ్ మాజీ సీఎస్ కుమారుడు కావడంతో విచారణ కూడా గుట్టుగా కొనసాగిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఇందుకు సంబంధించి పూర్తి సమాచారం ఇంకా తెలియాల్సి ఉంది.

# ఆర్థికంగా చితికిపోయాం .. ఎక్కువ నిధులకు సిఫార్స్ చేయండి

**- కేంద్ర ఆర్థిక సంఘానికి చంద్రబాబు వినతి**



అమరావతి, ఏప్రిల్ 16:గత అయిదేళ్లలో ఆర్థికంగా చితికిపోయాం.. ఉదారంగా కేంద్రం సాయం అందించేలా ప్రతిపాదనలు ఇవ్వాలని కేంద్ర ఆర్థిక సంఘానికి విజ్ఞప్తి చేశారు ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు.. కేంద్రం ప్రస్తుత ఇస్తున్న సాయంతో కొంతముందుకు వెళుతున్నా గతంలో చేసిన అప్పులు, వాటికి అవుతున్న వడ్డీలతో ప్రగతి రథం ముందుకు కదలడం లేదని వారికి దృష్టికి తెచ్చారు.. కాగా , పనగారియా నేతృత్వంలోని 16వ ఆర్థిక సంఘం బృందం నాలుగు రోజుల పాటు రాష్ట్రంలో పర్యటనకు అమరావతికి చేరుకుంది.. ఈ సందర్భంగా ఈ సంఘ ప్రతినిధులు చంద్రబాబు ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి సమావేశంలో పాల్గొన్నారు.

ముందుగా సచివాలయానికి చేరుకున్న ఆర్థిక సంఘం సభ్యులకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తన మంత్రి వర్గ సహచరులను , ఉన్నత స్థాయి అధికారులను ఆయన పేరు పేరునా పనగారియాకు పరిచయం చేశారు.

అనంతరం రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టుపై సచివాలయం మొదటి బ్లాక్లో ఏపీ రాష్ట్ర ప్రభుత్వం ఫొటో ఎగ్జిబిషన్ ను ఈ సంఘం ప్రతినిదులు తిలకించారు.. ఫొటో ఎగ్జిబిషన్లోని అంశాలపై సీఎం కేంద్ర ఆర్థిక సంఘం ప్రతినిధులకు వివరించారు. పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు వంటి అంశాలను ఎగ్జిబిషన్ లో ప్రదర్శనకు ఉంచారు. ఈ సందర్భంగా రాజధాని విషయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలను సీఎం వివరించారు. ఇందుకు సంబంధించిన వీడియోలను ప్రదర్శించారు.

కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, అందాల్సిన ప్రత్యేక సాయంపై సీఎం ప్రజంటేషన్ ఇచ్చారు. ప్రభుత్వ లక్ష్యాలు, స్వర్ణాంధ్ర విజన్ 2047 గురించి తెలిపారు. మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, పెట్టుబడులకు అనుకూలతల గురించి చెప్పారు. విభజన అనంతరం రాష్ట్రం ఎదుర్కొన్న ఆర్థిక కష్టాలను మరోసారి వివరించారు. గత ఐదేళ్లలో జరిగిన ఆర్థిక విధ్వంసంతో ఎదుర్కొంటున్న సవాళ్లను వారి దృష్టికి తీసుకెళ్లారు. కేంద్రం అదనపు సాయం చేయాలని.. దానికి అనుగుణంగా ప్రతిపాదనలు ఇవ్వాలని సీఎం కోరారు.

రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలు, స్వర్ణాంధ్ర విజన్- 2047, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, పెట్టుబడులకు ఉన్న అనుకూలతలు, రాష్ట్ర ప్రభుత్వ పాలసీలు సీఎం చంద్రబాబు వారికి వివరించారు. విభజన అనంతరం రాష్ట్రం ఎదుర్కొన్న ఆర్థిక కష్టాలు, తదనంతర పరిణామా లను వివరించారు. గత ఐదేళ్ల కాలంలో ఆర్థికంగా జరిగిన విధ్వం సం కారణంగా నేడు ఎదుర్కొంటున్న సవాళ్ల నేపథ్యంలో కేంద్రం అదనపు సాయం చేయాలని 16వ ఆర్థిక సంఘాన్ని కోరారు..

ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు , ఆర్థిక శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వివిధ పార్టీల ప్రతినిదులతో భేటి

ఇక చంద్రబాబుతో సమావేశం ముగిసన తర్వాత విజయవాడలో వివిధ పార్టీల ప్రతినిధులతో ఆర్థిక సంఘం సభ్యులు మాట్లాడనున్నారు. ఇక సాయంత్రం నోవాటెల్ హోటల్లో ఆర్థిక సంఘం సభ్యులు మీడియా సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం రాత్రి ఏడు గంటలకు విజయవాడలోని బెర్మ్ పార్కులో ముఖ్యమంత్రి ఇచ్చే డిన్నర్‌కు హాజరవుతారు. రాత్రి పది గంటలకు విజయవాడ ఎయిర్ పోర్టు నుంచి తిరుపతికి బయలుదేరి వెళతారు. గురువారం మధ్యాహ్నం రెండున్నరకు స్థానిక ప్రజాప్రతినిధులతో 16వ ఆర్థిక సంఘం సభ్యులు సమావేశం అవుతారు. అనంతరం వాణిజ్య, వ్యాపారవర్గాలతో తిరుపతిలో సమావేశం నిర్వహిస్తారు. తిరిగి ఈ నెల 18వ తేదీ తెల్లవారుజామున వెంకటేశ్వర స్వామిని దర్శించుకుంటారు. అనంతరం ఈ బృందం ఢిల్లీకి బయలుదేరి వెళుతుంది.

# గంజాయి ముఠా గుట్టు రట్టు.. 11కిలోల 210 గ్రాములు పట్టివేత




అమరావతి, ఏప్రిల్ 16:జయశంకర్ జిల్లాలో నిషేధిత ఎండు గంజాయి రవాణా చేస్తున్న ముఠా గుట్టు రట్టు చేశారు గణపురం పోలీసులు. భూపాలపల్లి సబ్ డివిజన్ పోలీసు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు కేసుకు సంబంధించి వివరాలు వెల్లడించారు. డీఎస్పీ మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం గంజాయి రవాణా గురించి విశ్వసనీయ సమాచారం మేరకు డీఎస్పీ ఆదేశాలతో చిట్యాల సిఐ మల్లేశ్ పర్యవేక్షణలో ఎస్ఐ అశోక్ తన సిబ్బందితో కలిసి రవినగర్ గ్రామ శివారులో గల మంగలోని కుంట మత్తడి వద్ద మాటు వేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు.

గుర్రంపేటకు చెందిన ఆరెల్లి అఖిల్, చెల్పూర్‌కు చెందిన ఆముదాల కార్తీక్, వరంగల్ జిల్లా వరికోల్‌కు చెందిన ముస్కే రోహిత్ ల వద్ద రూ. 5,60,500 (1 కేజీ 50,000) విలువ గల 11 కిలోల 210 గ్రాముల నిషేదింపబడిన ఎండు గంజాయి ఒక సంచిలో పట్టుకొని ఉండగా, వెంటనే వారిని అదుపులోకి తీసుకొని విచారణ చేశామని తెలిపారు. వీరు సంపాదించే డబ్బులు జల్సాలకు సరిపోకపోవడంతో గత కొద్ది రోజులుగా అక్రమంగా ఒరిస్సా రాష్ట్రంలోని కొండ ప్రాంతాల్లో గుర్తు తెలియని వ్యక్తుల దగ్గర తక్కువ ధరకు తెచ్చి భూపాలపల్లి, ఘనపురం మండల్ పరిసర ప్రాంతాల్లో అమ్ముతున్నారని తెలిపారు. గంజాయి పట్టుకోవడంలో ఉత్తమ విధులు నిర్వహించిన చిట్యాల సిఐ మల్లేశ్, సిసిఎస్ సిఐ వెంకటేశ్వర్లు, ఘనపురం (ము) ఎస్ఐ అశోక్, సిసిఎస్ ఎస్ఐ భాస్కర్ రావు, సిబ్బంది పీసీలు జే.శ్రీనివాస్, ఏ.అశోక్, పి.క్రాంతి, పి.నేతాజీ లను భూపాలపల్లి డిఎస్‌పి, సంపత్ రావు ప్రత్యేకంగా అభినందించారు.

## చురక

చరిత్రలో కొంతమందే
చిరస్థాయి నిలుస్తారు
అమరులైతేనేమి జనం
ఆద్యంతం కొలుస్తారు
ఉద్యమాల జెండాలై
ఊరేగుతూ చలిస్తారు
పాతిపెట్టి వేయాలని
ప్రయత్నిస్తే జ్వలిస్తారు



-వేల్పుల నారాయణ
9440433475

## నేటి కందం- నేటికి అందం

అరివీర భయంకరుడై
పురజనులకు రక్షణ నిడు మూర్తిగ చెలగన్
వరగుణుడని ఖ్యాతి గొనెను
సరదారు హుకుమ్ము సింగు సర్వుల చేతన్

(17-4-1962 సర్దార్ హుకుం సింగ్ లోకసభ స్పీకరుగా ప్రమాణం చేసిన రోజు)



-రాధశ్రీ
సెల్:9494481210

# రాజ్యసభ స్థానానికి ఉప ఎన్నిక : షెడ్యూల్ విడుదల

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:పీలో ఖాళీగా ఉన్న ఒక రాజ్యసభ ఎంపీస్థానానికి ఉప ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. వైఎస్సార్సీపీ రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి రాజీనామా చేయడంతో ఖాళీగా ఉన్న ఈ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించనున్నట్లు ఈసీ పేర్కొంది.

ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం..

ఈ నెల 22న నోటిఫికేషన్ జారీ చేస్తారు. 29 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 30న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. మే 2 వరకు నామినేషన్ల ఉపసంహారణకు గడువు ఇచ్చారు. మే 9న ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ ఉంటుంది. అదేరోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్లు లెక్కిస్తారు. 13వ తేదీలోపు ఈ ఎన్నికల ప్రక్రియ పూర్తికానుంది.

నేటినిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com    website: www.netinijam.com
2 హైదరాబాద్    ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433    గురువారం 17-4-2025

## హైకూలు

ఉక్కపోతలు
స్వేద జలపాతాలు
గ్రీష్మప్రతాపం.

వేసవిగాడ్పు
ఆబాలగోపాలము
ఆపసోపాలు.

దప్పికౌతుందా?
చిరునామా ఉందిగా
చలివేంద్రము

మండుటెండలు
మలమల మాడ్చేస్తు
నీడ ఎక్కడ?.

తెరతీస్తాయి
నవచైతన్యానికి
ఉష్ణతాపాలు.

చినుకురాల్చే
చల్లని మేఘం చాలు
ఉపశమనం.



- డాక్టర్ చక్రపాణి
యిమ్మిడిశెట్టి
9849331554

## ఘంటారావం

కలాన్ని
కదిలిస్తున్నాననుకోకు
కాళ్ళనూ
కదిలించడం మానకు

రూపమే
ఘనతరమనుకోకు
అష్టావక్ర
గీతను మరువకు.

ధనికుడిలా
నటిస్తే ఎలా
అప్పులపాలవ్వటమే
కదా.

కలల్ని
కత్తిరించకు
అలల్ని
ఆపాలనుకోకు



-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964



## వన విలాపం !

వనం వల వల విలపిస్తున్నది
చెట్టు చలించి పోతున్నది
ఆకు ఆవేదన పడుతున్నది
అడవి అనాథ అయ్యింది !
మొక్కలు తల వంచి..
అర్పిస్తున్నాయి నివాళులు
వృక్షోవృక్షతి రక్షిత నినాదాలు..
మౌనవ్రతం పాటిస్తున్నాయి !
కుండలు చేసిన చేతులు
పాలను అమ్మిన పాదాలు
మొక్కలకు ప్రాణం పోసిన హస్తాలు
స్వర్గంలో హరితం బోధిస్తున్నాడేమో!
పద్మశ్రీ దరిపల్లి రామయ్య
వనజీవి డాక్టర్ రామయ్య
హరిత మిత్రుడు రామయ్య
అడవి పుత్రుడు రామయ్య !
కోటి మొక్కలకు ప్రాణం పోసి..
ఆవాసాల్ని అడవులుగా మార్చి..
మురిసిపోయిన వనజీవి జీవితం
సమాజానికే చూపుతున్న దారి దీపం!



-మధుపాళీ
9949700037

## వనజీవికి జోహార్లు

కోటి మొక్కల పూల గొంతులు
ఒక్కసారిగా మూగపోయాయి
అడవిపూలన్నీ నల్లబడ్డాయి .
వనమూలన్నీ వెక్కివెక్కి ఏడ్చి
శశిరాన్ని అలముకున్నాయి.
వనజీవి ఇక లేరని తెలిసి
తరవులన్నీ బోరుమంటూ
నింగినే గర్జించాయి
రామయ్యా అంటూ శోకించాయి.
ఈ విషాద రాగానికి
అడవి గాలి అలికిలిడి మరిచి
స్పృహ కోల్పోయింది
పురుడు పోసే నాథుడు
లేడని తెలిసి
గూటిలోని గింజ
గుండె నాపేసుకుంది.
ఈ అరుదైన చెట్ల ప్రేమకుడిని
పుడమి ప్రేమగా
తన ఒడిలో కలుపుకుంది
ప్రతికొమ్మ , ప్రతిరెమ్మ తల్లడిల్లింది
ఓ వనజీవి రామయ్య
సరికొత్త వనమై
మరల లేచి రావయ్యా అంటూ
ప్రకృతి జోహార్లు పలికింది..



- కవిశ్రీ
9493785596

## పచ్చ సంతకం

నీటి బొట్టు బావురుమంది
మొక్క దాకా తనను మోసే
వనజీవి వాడిగిపోయాడని
'పద్మశ్రీ' పరవశించింది తొలిసారి
తనకు వచ్చదనపు ఆనందాన్ని
పరచినందుకు.
చెట్టుకు కూడా బట్టలూడదీసే
దుశ్శాసన రాజ్యంలో
పచ్చరంగు వలువలు పంచిపెట్టే
కృష్ణుడే కాదు, రాముడూ వున్నాడు.
నారుపోసినవాడే నీరు పోస్తాడన్నది
పాత నమ్మకం,
నారూ, నీరు ప్రతి ఒక్కరిదీ అన్నది
కొత్త సంతకం.
ఇది వనజీవి జీవితం నేర్పిన
శ్రమ తంత్రం.
(పద్మశ్రీ వనజీవి రామయ్య
మరణం
సందర్భంగా )



-మాయకుంట్ల
నారాయణరెడ్డి
99896 86603



# "సత్యారాధేయమ్' స్మృతి కావ్యానికి అనుబంధంగా "సాంత్వనమ్"..!

ప్రముఖ సాహితీవేత్త డా॥ రాధేయ తమ శ్రీమతి సత్యాదేవి స్మృతిలో రాసిన "సత్యారాధేయమ్" కావ్యం తెలుగు కవులను, రచయితలను ఆర్ద్రంగా పలకరించింది. ఈ కావ్యాన్ని చదివిన ఆత్మీయులంతా డా॥రాధేయ దుఃఖాన్ని పంచుకున్నారు. ఆయనకు కొండంత అండగా నిలిచారు. ఆయన బాధను, వేదనను పంచుకుంటూ సాహితీ బంధువులు శ్రీమతి సత్యాదేవి నిష్క్రమణం పట్ల సానుభూతితో అక్షరాంజలి ఘటిస్తూ.. రాధేయగారికి బాసటగా నిలిచారు. మూడు దశాబ్దాలుగా అవిశ్రాంతంగా రాధేయ దంపతులు అందిస్తున్న వారి ఉమ్మడిశెట్టి అవార్డు సత్యాదేవి మరణంతో.. రాధేయగారిలో అలుముకున్న నైరాశ్యం.. నిర్వహణ ప్రశ్నార్థకమైంది. ఈ నేపథ్యంలో.. ఈ అవార్డు మున్ముందూ కొనసాగాలని కాంక్షిస్తూ ప్రతి తెలుగు సాహితీ సృజనకారుడు కోరుకోవడం విశేషం! ఈ విషాదం నుండి కోలుకోవాలంటే.. రాధేయ దంపతుల మానస పుత్రికగా రూపొందిన ఉమ్మడిశెట్టి పురస్కారాన్ని కొనసాగించాలన్న దృఢ నిర్ణయాన్ని రాధేయగారు తీసుకోవడానికి కారణం తెలుగు కవులందరూ విషాద సమయాన అండగా నిలిచి మానసిక స్థైర్యాన్ని కల్గించడమేనని చెప్పవచ్చు.





ప్రతులకు:
ఉమ్మడిశెట్టి
లిటరరీ ట్రస్టు
సెల్: 9985171411

**మూడు దశాబ్దాలుగా అవిశ్రాంతంగా రాధేయ దంపతులు అందిస్తున్న వారి ఉమ్మడిశెట్టి అవార్డు సత్యాదేవి మరణంతో.. రాధేయగారిలో అలుముకున్న నైరాశ్యం..**

ఫలితంగా ఈ అవార్డుకు సత్యాదేవి పేరును జోడిస్తూ 2018 నుండి "ఉమ్మడిశెట్టి సత్యాదేవి సాహితీ అవార్డు"గా సవరించి రాధేయగారు తమ సతీమణిగారి పట్ల గౌరవాన్ని చాటుకున్నారు.

వరుసగా నాలుగేళ్ళుగా (2018, 19,20,21) అవార్డు విజేతలను ప్రకటించి.. అవార్డు సభలను తను లేని లోటును కనిపించకుండా అత్యంత వైభవంగా జరిపించారు. అంతేగాక.. ప్రముఖ చిత్రకారిణి, శిల్పి, ఆమ్రపాలి గారి చేత 'సత్య' శిల్పాన్ని తయారు చేయించుకుని 2021 అవార్డు సభలోనే ప్రముఖ నాట్యాచార్యులు శ్రీమతి సంధ్యామూర్తి గారిచే ఆవిష్కరింపజేసి సత్యాదేవి గారి పట్ల డా॥ రాధేయ తమ శ్రద్ధాభక్తులను ప్రకటించుకున్నారు. అదే సభలోనే రాధేయ గారి చిన్నమ్మాయి సృజన కన్నీటి ధారల మధ్య "సత్యా రాధేయమ్" స్మృతి కావ్యాన్ని ఆవిష్కరించారు. ఈ నేపథ్యంలో సత్యారాధేమయ్‌ను అందుకున్న ప్రతి కవీ స్పందించారు. ఆయనకు ఉత్తరాలు రాశారు. సమీక్షలు రాశారు. ప్రత్యేక వ్యాసాలు రాశారు. చరవాణి సందేశాలు పంపారు. వీటిల్లోంచి కొన్నింటిని ఏర్చి కూర్చి ఓ సంపుటిగా 'సాంత్వనమ్' పేరుతో 'సత్యా రాధేయమ్'కు అనుబంధంగా ఓ గ్రంథాన్ని వెలువరించారు. సత్యాదేవి మరణించిన సందర్భంగా.. రాధేయ గారిని ఓదార్చుతూ.. రాధేయగారికి సత్యాదేవి జీవిత భాగస్వామిగా అందించిన సేవలను.. ప్రస్తావిస్తూ రాసిన రచనలు పొందుపరుస్తూ "సాంత్వనమ్' గ్రంథాన్ని రూపొందించారు.

"సత్యారాధేయమ్' స్మృతి కావ్యంపై స్పందిస్తూ.. వచ్చిన రచనలతో వెలువడిన "సాంత్వనమ్" నిజంగా 'సత్యా రాధేయం' కావ్యానికి అనుబంధంగా ఉండే విధంగా రూపొందించబడింది.

**"అర చేతులడ్డు పెట్టినా కొండెక్కిన దీపం ముందు నడక ఆగిపోయిన ఓ సెలయేటి సంభాషణ"**గా సత్యారాధేయమ్ కావ్యాన్ని కవి పేర్కొన్న విషయాన్ని గుర్తు చేస్తూ.. డా॥ జోస్యులకృష్ణ బాబు గారు రాసిన వ్యాసంలో ప్రస్తావించారు. ప్రస్తుతించారు. ప్రశంసించారు.

త్యాగపు పూదోట పరిమళం! సత్యా రాధేయమ్ అంటూ డా॥ కాళ్ళకూరి శైలజగారు రాసిన వ్యాసంలో మీరిరువురు ధన్యజీవులు, సత్యాదేవి మిమ్మల్ని వీడటం భౌతికమే! మీరు ముందుకు నడవండి సార్! మీరిద్దరూ ఎందరికో ఆదర్శం అంటూ రాధేయ గారికి పంపిన ఓదార్పు మాటలను చూస్తాం..

కవిత్వం పట్ల ఆవిడకు గల అభిమానం.. కవుల పట్ల ఆమెకున్న గౌరవం.. తెలుస్తుంది. భర్తకు అడుగడుగునా అండగా నిలబడటం.. అభిప్రాయాలొకటైన అనుకూల దాంపత్యంగా నిలవడం అందరికీ ఆదర్శమంటూ. కవయిత్రి మందరపు హైమవతిగారు తమ వ్యాసంలో పేర్కొన్నారు. ద్వంద్వ సమాసం లాంటి సత్యారాధేయుల పదాల్లో ఒక పదం లేని విషాదమ్ "సత్యారాధే యమ్" అని హైమవతి గారు వ్యాఖ్యానించారు.

మాధుర్య విషాదం-సత్యా రాధేయమ్ అంటూ కళారత్న డా॥ భూ సురుపల్లి వేంకటేశ్వర్లు గారు రాస్తే.. ఆర్ద్ర భరిత కావ్యం.. 'సత్యా రాధేయమ్' అంటూ మాధవీ సనారాగారు అక్షరాంజలి ఘటించారు. శ్రీమతి వాణి కొరటమద్ది "సత్యారాధేయం..కవితా నిలయం" అని పేర్కొంటే. ప్రతి పేజీ తడి తడి పాద ముద్రలే! అంటూ శీలా సుభద్రాదేవి గారు అభిప్రాయపడ్డారు.

స్మృతి కావ్యాలలో చిరస్థాయిగా నిలిచే "సత్యారాధేయమ్" అంటూ కోడిహళ్ళి మురళీమోహన్‌గారు పేర్కొంటే.. 'అమూల్యం సత్యా రాధేయమ్' అంటూ డా॥ కె, నాగ సత్యనారాయణ తమ వ్యాసాన్ని తీర్చిదిద్దారు.

ప్రేమ మూర్తి సత్యాదేవిగారు లేరు. కానీ ఈ కావ్యంతో సత్యాదేవి హృదయాన్ని సజీవంగా ఆవిష్కరిస్తూ శాశ్వతంగా జీవింపజేశారని వనపట్ల సుబ్బయ్య పేర్కొంటే.. శ్రీమతి సంధ్యామూర్తి జయదేవుని అష్టపదిగా సత్యారాధేయమ్‌ను అభివర్ణించారు. రాధేయ గొప్ప మానవత్వం ఉన్న మనిషి అనీ.. తన భార్యకు సాహితీ చరిత్రలో ఇచ్చిన అద్భుతమైన నివాళి "సత్యారాధేయమ్" అని వివరిస్తే.. తన ప్రేమనంతా రాధేయ ఏరి కూరిస్తే "సత్యారాధేయమ్" కవిత్వం అయిందని సుంకర గోపాలయ్య అభిప్రాయపడ్డారు. స్మృతి కావ్యాలన్నీ ప్రేమ లేఖలే అంటూ పలమనేరు బాలాజీ వ్యాఖ్యానిస్తే.. బరువునంతా ఒంటెద్దుపై వేసి ప్రాణ పగ్గం తెంచుకుని వెళ్ళి పోయిందంటూ డా॥ పెళ్లూరు సునీత తన కవిత ద్వారా తెలిపారు.

దోర్నాదుల సిద్ధార్థ 'అమృత' శీర్షికతో రాసిన కవితలో ఆయనకు ఎన్నో పురస్కారాలు రావచ్చు.. మీరు ఆయనకు జీవిత సాఫల్య పురస్కారమని రాస్తే.. 'సత్యా రాధేయమ్' ఏకబిగిన చదివించిన కవిత్వమిది అనీ.. కనురెప్పల నడుమ కన్నీటి వారధి కట్టిన కావ్యంగా పేరిశెట్ల శివకుమార్ పేర్కొన్నారు. దుఃఖపు భాష ఒక్కటే! అంటూ భారతి కోడె అంటే.. యాములపల్లి నర్సిరెడ్డి 'ప్రాణ కావ్యం'గా అభివర్ణించారు. రాధేయ గొప్ప భాగ్యవంతుడని గండేట గౌరునాయుడు రాస్తే.. ఒక ఊహకందని త్యాగపు పూదోట పరిమళంగా కాశీంబీ పేర్కొన్నారు. పరిపూర్ణ అమరత్వ కావ్యంగా రవీణాచవాన్ అంటే.. సార్థక జీవనమని రావుల వసంత మణి వ్యాఖ్యానించారు. యదార్థ జీవన యానంగా అని వి. ప్రతిమ పేర్కొంటే.. కవిత్వమే జీవిత మైన దాంపత్యం అంటూ రూపా రుక్మిణి అన్నారు. అపురూప సాహితీ కానుకగా సుధామైత్రేయి వర్ణిస్తే.. తీరం దాటని తుఫానులో ఒంటరి కవి అని డా॥ పి. సునీల్ వివరించారు.

గతం, స్వగతంతో సాగే.. సత్యారాధేయమ్ అని దాస్యం సేనాధిపతి రాస్తే..సత్యవంతమైన జీవితం సత్యారాధేయమ్ అని అనిల్ డ్యానీ పేర్కొన్నారు. వియోగాన్నిచ్చిన కాలానికో చురక లేఖ ఈ కావ్యం అని రమాదేవి బాలబోయిన వ్యాఖ్యానిస్తే.. అచ్చపు దాంపత్యశ్రీకి అద్దం పట్టిన కావ్యమని గబ్బిట దుర్గాప్రసాద్ రాశారు. ఆయన ఆశయంలోనూ, ఆచరణలోనూ వెన్నంటి నడిచిన భాగస్వామి అని ములుగు లక్ష్మీ మైథిలి పేర్కొంటే.. స్ఫూర్తి కావ్యంగా సోంపాక సీత అభిప్రాయ పడ్డారు. రాధేయ బలం సత్యాదేవి.. ఉన్నప్పుడే కాదు, ఎల్లప్పుడూ రాధేయ కవితల్లో అక్షరమై ఆమె సత్యమై నిలిచి వుంటుందని డా॥ ప్రగతి అంటే..సత్యాదేవి అక్షరాలా చిరంజీవి అంటూ డా॥సి. భవానీ దేవి రాశారు. రాధేయ ఇలా కవిత్వ రూపంలో వారి సతీమణి 'సత్యంగా' వెదుక్కోవడం అనిర్వచనీయమని తండా హరీష్‌గౌడ్ అంటే.. జ్ఞాపకాల ధారగా కిశోర్ కృష్ణ ఆవిష్కరించారు. మనసున మనసై బ్రతుకున బ్రతుకై అంటూ ఆమ్రపాలి ప్రముఖ చిత్ర కళాశిల్పి రాస్తే.. అణువణువున సత్యానురాగం.. అడుగడుగున సత్యానుబంధం అంటూ అష్టావధాని విద్వాన్ చక్రాల లక్ష్మీకాంతరావు రాశారు. కంటి చెమ్మ-సత్యారాధేమ్ అంటూ అన్నవరం దేవేందర్ రాస్తే.. కాసుల రవికుమార్ రాధేయ దంపతుల అన్యోన్య దాంపత్యాన్ని కొనియాడారు. ప్రతి అక్షరంలోనూ "సత్య"మే అంటూ నరికొండ నరసింహరాజు అంటే.. ఆమె లేక అతడు ఒరిగాడే గానీ విరగ లేదంటూ పి. శ్రీనివాస్ గౌడ్ రాశారు. ప్రముఖ కవులు, డా॥ఎన్.. గోపి, కె. శివారెడ్డి, ఆశారాజు, డా॥ కడియాల రామ్ మోహనరాయ్,ఆచార్య ఎండ్లూరి సుధాకర్‌లు పండిన చరవాణి సందేశాలను ఈ గ్రంథం చివరన పొందుపరిచారు.ఇలా.. "సత్యారాధేయమ్' స్మృతి కావ్యంపై పలువురు ప్రకటించిన భావాలను "సాంత్వనమ్' ద్వారా అందించిన కవి డా॥రాధేయ అభినందనీయులు. తమ జీవిత భాగస్వామి సత్యాదేవిగారు యిప్పుడు లేకున్నా.. ఆమె జ్ఞాపకాల నీడలో ముందుకు సాగుతూ ఆమె ఆశయ సాధనకు అడుగులు వేస్తున్న రాధేయగారికి అందరు అండగా నిల్వడం విశేషం! సాహితీ క్షేత్రంలో నిబద్ధతతో కృషి చేస్తున్న డా॥ రాధేయగారి హృదయపూర్వక నమస్సులు తెలియజేద్దాం. కవిత్వం, వ్యాసం తదితర ప్రక్రియల్లో డా॥ రాధేయను పరామర్శిస్తూ సాంత్వన పలికిన ప్రతి ఒక్కరికి వందనాలు సమర్పిద్దాం..



- దాస్యం సేనాధిపతి
సెల్:9440525544

## ఓ తోడు కావాలి!

ప్రతి మనిషికి ఓ తోడు
అవసరం జీవన పర్యంతం.
నవ్వుల పువ్వులు విరిసే వేళ
పంచుకోవడానికి ఒక చేయి కావాలి.
కన్నీటి సంద్రం ముంచెత్తే వేళ
ఓదార్చడానికి ఓ గుండె కావాలి.
తోడు ఒక వరం
ఒంటరితనం ఓ శాపం.
ఆపదలోనైనా ఆనందంలోనైనా
తోడు లేని జీవితం అసంపూర్ణం.
మాటలతో ఊరడించాలన్నా
మౌనంగా తోడుండాలన్నా
మనిషికి మరో మనిషే ఆధారం.
జీవనదారి ఎలాంటిదైనా
ఒంటరి ప్రయాణం కన్నా
ఓ తోడుంటేనే అది సుగమం.
చివరికి మనస్ఫూర్తిగా
నవ్వాలన్నా ఏడ్వాలన్నా
ఓ తోడు కావాలి.
ఈ లోకంలోకి వచ్చిన తడవే
కళ్లు తెరిచి చూసే లోగా
చుట్టుముట్టేస్తాయి బంధాలన్నీ.
కన్న వాళ్ల ప్రేమలో
తోబుట్టువులుల అనురాగంలో
స్నేహితుల సాన్నిహిత్యంలో
సాగిపోతుంది జీవితమంతా.
ఒంటరిగా పుట్టినా
చివరికి ఒంటరిగా పోయినా
జీవిత కాలం కావాలి ఓ తోడు
ఇదే కదా జీవిత సత్యం!



-ఆచార్య కదారు వీరారెడ్డి
9392447007

## వలసల వేదనలు

చేతికి అందివచ్చిన కొడుకు
కళ్ళముందు కనిపించగానే
కడుపు నిండిపోయింది
చెట్టంత ఎదిగిన కన్న కొడుకు నీడలో
కష్టాలన్నీ తీరి సేదతీరుదామనుకోగా
కన్నవారికి ఆనందాలు పంచవచ్చుని
ఎవరో చెప్పినవి
తాను విన్న మాటలునమ్మి
లోకం పోకడ ఎరుగక
అందరి ఆకలితీర్చే అమ్మలాంటి
నేలమ్మను పరుల పాలు చేసి
చేతికందిన విత్తం వ్యయంచేసి
కన్నవారు రెక్కలు విరిగిన పక్షులయి
కన్నీటి పొరలగుండా చూస్తుండగా
లోహవిహంగాన్నధిరోహించి
తాను స్వర్గమనుకొన్న ప్రదేశం
నరకాన్ని తలపిస్తున్నట్లుండగా
రాళ్ళు, ముళ్ళ బాటల మీదుగా
నడుస్తూ
పాదాలు పుళ్ళయి రక్తసిక్తంకాగా
అడుగులు తడబడుతుండగా
నడవలేక, మాట్లాడే మనిషి లేక
శకలాలు, శవాలమధ్యనుంచి
బిక్కు బిక్కుమంటూ భయంభయంగా
కళ్ళల్లో ప్రాణాలు నిలుపుకుని
నిద్రాహారాలు కరువై ఆకలిలో
అమ్మ చేతి గోరుముద్ద గుర్తుచేసుకుంటూ
కన్నీళ్ళ నీళ్లతో కడుపు నింపుకొంటున్న
పిల్లల్ని తలుచుకుంటున్న తల్లుల
కన్నీటితో నిండి పనామా కాలవైందో
ఏ తల్లి చూపులవేడిమి ఎడారి
చేసిందో
అడ్డుగా ఉన్న కంచెలు దాటితే
అరదండాలు తప్పలేదు
కన్నవారి కడగండ్లు తీర్చలేకపోతిమని
కొడుకుల వేదనలు
కదిలి వెళ్లిన కన్నపేగు కంటపడితే
చాలన్న తల్లి ఆవేదన
కాలమేదైనా వలసలు
ఎప్పుడు ప్రమాదకరమే
అయినవారితో కలిసి
గంజితాగినాఆనందమే
వలసజీవులకు ఎప్పుడూ
జీవనపోరాటంతప్పదుకదా!
నిలబడి నీళ్ళుతాగటంమేలు
పరిగెడుతూతాగే
అమృతమయినా విషంతోసమానం
నిజాయితీగా చేసే పనిలో
అంతులేని ఆనందం
అందులోని సంతోషాలను
నీ స్వంతం చేసుకోటానికి
ప్రయత్నించు
కష్టపడితే నీ గమ్యం పువ్వుల బాట
నువ్వున్నచోటే అందాల
ఆనందాల విరితోట.



-డా.మైలవరపు
లలితకుమారి
9959510422

## అమ్మ కనిపించింది !

ఇన్ని వాస్తవాలు తెలిసినాక
కలగనుట
కన్నుల పుణ్యమే!.
ఇన్ని త్యాగాలు చేసినాక
నిజమగుట
స్వప్నాల ఫలమే!.
పడక పట్టుపాన్పే
నిదురను కప్పేసుకోదు
మెలుకువ ను దులిపేసుకోదు!
నడక బాటవేసిన
మనిషిని మరువదు
పేరు పేరునా పిలుచుకుంటది!
నగర ట్రాఫిక్ లో ఇరికిన
నరునికి
ఏ నగరమైనా
స్వర్గధామం అవుతుందా!
అరణ్యాలు ఆదిమానవున్ని
అమ్మ వలె చూసుకున్నవి
ఆధునిక జనారణ్యంలో
అమ్మ అగుపిస్తలేదు !
పాత్రల్ని తళతళలాడేలా తోమేది
మిగిలిన అన్నం కూరలు తీసుకెళ్లేది
అప్పుడు ఆమె పనిమనిషి !
ఊరు నుండి అమ్మానాన్నలు
డబ్బులు పంపడం ఆలస్యమైతే
అర్థాకలే! సద్దన్నం కూడా కరువే!
పనిమనిషి తన జీతం డబ్బులతో
సన్నబియ్యంతెచ్చి కడుపునింపినపుడు
ఆమెలో అమ్మ కనిపించింది !



- పి.బక్కారెడ్డి
9705315250

## సునందామృతం

దగ్ధము అంటే కాల్చబడిన, కాలిన అని అర్థం. ఇంధనము అంటే చిదుగు లేదా వంట చెఱకు,వంటకు ఉపయోగించే కట్టెలు అని అర్థం. వహ్ని అంటే అగ్ని,పాచక శక్తి, ఆకలి అనే అర్థాలు ఉన్నాయి.

వంట కట్టెలు వంట చేయుటకు తోడ్పడి, తాము మాత్రము కాలిపోతాయి.

సజ్జనులు కూడా వంట కట్టెల వంటి వారే. తమ నష్టమును

**తమోదీప న్యాయము**

సైతము లెక్కచేయకుండా ఇతరులకు సాయపడుతారు అనే అర్థంతో ఈ దగ్ధేంధన వహ్ని న్యాయమును ఉదాహరణగా చెబుతుంటారు.

సజ్జనులు అంటే మంచి మనసున్న వారు.వారి మనసు ఎంత మృదువైనదో ఈ శ్లోకంలో చూద్దాం.

"మృదులం నవనీతమీరితం
నవనీతాదపి సజ్జనస్యహృత్/తదిదం
ద్రవతి స్వతాపనాత్
పరతాపాద్రవతే సతాం పునః"

అంటే భావం ఏమిటో చూద్దాం.నవనీతం అంటే వెన్న.ఇది చాలా మృదువుగా ఉంటుంది.కానీ నవనీతము కంటే కూడా సజ్జనుల హృదయము మరింత మృదువై నదనీ ఈ శ్లోకం చెబుతోంది.

ఎందుకంటే వెన్నను వేడి చేస్తేనే కానీ కరుగదు స్వతాపనాత్ ద్రవతే.కానీ సజ్జన హృదయము పరతాపా ద్రవతే అంటే ఇతరుల తాపాలకు అనగా ఎదుటి వారి బాధలు కష్టాలనే వేడికి కూడా కరిగిపోతుంది అని అర్థం.

మరి వెన్న కరగాలి అంటే వేడి అనే కష్టాన్ని భరించాలి. అప్పుడే తన మృదుత్వం వల్ల కరిగి పోతుంది.

కానీ సజ్జనుల హృదయ మృదుత్వం ఎంత గొప్పదంటే ఎదుటి వారి కష్టాలను చూసినప్పుడల్లా మళ్ళీ మళ్ళీ కరిగిపోతూనే వుంటుంది.అలా ఇతరుల మేలు కోసం తాము కరిగిపోతూ జీవితాలను త్యాగం చేసేవారే సజ్జనులు అని అర్థం.×

×ఇలాంటి అర్థం వచ్చేలా సజ్జనుల గొప్పతనం గురించి భాస్కర శతక కర్త ఏమన్నాడో చూద్దాం.

'ఉంగ గుణవంతుం డొర్లదన కొండపకారము సేయునప్పుడున్/ బరుతమేయొనర్చు నొక పట్టునైనను గీడు సేయగా/ నెఱుగడు నిక్కమేకద యదెట్లన గవ్వము బట్టి యెంతయున్/దరువగ జొచ్చినం బెరుగు తాలిమినీయదె వెన్న భాస్కరా!"

అంటే గుణవంతుడు లేదా సజ్జనుడు ఇతరులు కీడు చేయుచున్నను వారికి ఎప్పుడూ మంచినే చేస్తాడు.ఎలాంటి సందర్భంలోనూ అపకారము తలపెట్టడు.అదెలా అంటే కవ్వముతో పెరుగును ఎంత చిలికినా వెన్ననే ఇస్తుంది కానీ కోపగించదు కదా అంటారు.

అలాంటి ఉత్తమ లక్షణాలను కలిగిన వారే సజ్జనులు. సాటి వారికి సాయం చేయడం కోసం తాము కష్టాలను,నష్టాలను భరిస్తూ త్యాగం చేయడం సజ్జనుల లక్షణమని ఈ "దగ్ధేంధన వహ్ని న్యాయము'' ద్వారా తెలుసుకోవచ్చు.



-పురిమళ్ల
సునంద

పుస్తక సమీక్షలు

# రాజన్న హైకూలు - వెలుగు పూలు

హైకు అనునది జపనీ సాహిత్యంలో విశేషమైన ఆదరణ పొందిన ప్రక్రియ. విశ్వ కవితా రూపాలలో ఒకటైన హైకు ఆదికవి జపాన్ రచయిత బషో. వీరి తర్వాత అనేకమంది కవులు జపనీస్ హైకులను పరిపుష్టం చేశారు.

జపాన్ దేశంలో రూపొందిన ఈ ప్రక్రియ ఇంగ్లీషు భాషతో పాటు పలు ఇతర భాషలోకి అలాగే మన తెలుగు భాషలోకి వచ్చింది. తెలుగులో హైకూలను తొలిసారి పరిచయం చేసింది కవి ఇస్మాయిల్ గారు. అయితే తెలుగులో తొలి హైకూలు రచించింది గాలి నాసర రెడ్డి . ఈయన రాసిన ఐదు హైకూలు 1990లో ఆంధ్రభూమి దినపత్రికలో అచ్చు కావడం జరిగింది. "రహస్య ద్వారం" "చినుకుల చిత్రాలు" పేర్లతో పెన్నా శివరామకృష్ణ కప్పల నిశబ్దం పేరుతో ఇస్మాయిల్ "కంజీర" "సాంగత్యం" పేర్లతో గాలి నాసర రెడ్డి "రాలిన పూలు" పేరుతో రాలి ప్రసాద్ గారు హైకూ ప్రక్రియలో పుస్తకాలు వెలువరించారు. అలా మొదలైన హైకూల ప్రస్థానం దినదినము ఎదిగి ఉంది. 70కి పైగా పుస్తకాలు ఈ ప్రక్రియలో వెలువడినాయంటె ఈ ప్రక్రియను మనం ఎంతగా సొంతం చేసుకున్నామో అర్థమవుతుంది. అధ్యాపకులు, బహు గ్రంథకర్త, కవి సత్య శ్రీనివాస్ గారు "హైకూలు- ఒక పరిశీలన" పేరుతో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించి 2007లో డాక్టరేట్ పట్టా పొందారు. హైకూ సాహిత్యంలో మొట్టమొదటి పరిశోధక రచన ఇదే. చెరువులోకి విసిరిన రాయి ఎన్ని తరంగాలను సృష్టిస్తుందో, అలాగే హైకూలు పాఠకునిలో అంతకంటే ఎక్కువ ఆలోచన తరంగాలను జనింప చేస్తుంది.



ప్రతులకు :
నగునూరి రాజన్న
సెల్ : 8332963129



ఈ ప్రక్రియ పై విమర్శ గ్రంథాలే కాకుండా అనేక వ్యాసాలు కూడా రచయితలు రాశారు. అనకాపల్లికి చెందిన డాక్టర్ తలతోటి పృథ్వీరాజు గారు తెలుగు హైకూల వ్యాప్తికై హైకూ క్లబ్ ను స్థాపించి ఎంతో కృషి చేస్తున్నారు.

మూడు పాదాలు కలిగి ఉండి 17 అక్షరాలు కలిగిన త్రిపద హైకూ. మొదటి పాదంలో ఐదు రెండో పాదంలో ఏడు మూడో పాదముల ఐదు చొప్పున అక్షరాలు ఉండి అద్భుతాన్ని చూపగల గొప్ప ప్రక్రియ ఇది. ఇందులో ఒక్క వ్యర్థ పదం ఉండదు.సూక్ష్మంలో మోక్షంలా హైకూ పరిమాణంలో చిన్నదైనా అది చెప్పే భావం విశాలమైనదిగా ఉంటుంది. హైకూ క్లుప్తతను కలిగిన ప్రక్రియ.

హైకు అన్న పదం లో "హై" అంటే వినోదకర అని "కు" అంటే కవిత అని అర్థాలు. హై కు ఈ రెండు చైనీస్ బై- కియు నుంచి వచ్చాయి. తెలుగులో మనం హైకూలు అంటాము.

శ్రీమతి వకుళా వాసు గారు ప్రారంభించిన హైకూల సమూహం లో చేరి విస్తృతంగా హైకూలు రాస్తున్న నగనూరి రాజన్న గారు "వెలుగు పూలు" పేరుతో చక్కని చిత్రాలతో హైకుల సంపుటిని నేడు వెలువరించడం అభినందనీయం. వీరు అటు వచన కవిత్వంలోనూ, ఇటు గజల్, హైకూలు, గేయాలు, పాటలు, కథలు ప్రక్రియలలోనూ రచనలు చేస్తూ సాహిత్యం లో తనకంటూ ఒక స్థానాన్ని దక్కించుకున్నారు.

వెలుగు పూలు హైకుల సంపుటి లోకి తొంగి చూద్దాం...

"వెలుగునీడ
జీవిత చక్రాలని
విడమరిచే"

జీవితంలో సుఖదుఃఖాలు లాభనష్టాలు సహజం.రాత్రి పగలు లాగే వెలుగునీడలుంటాయి. జీవితంలో ఇవి వస్తుంటాయి పోతుంటాయి. సహజమే... జీవితచక్రంలో సహజమైన వీటి గురించి ఎక్కువగా ఆలోచించక ముందుకు కదలాలని తెలిపే ప్రయత్నమే ఈ హైకూ అంతరార్థం

మనం రాసే ఉత్తరాలు చేరాల్సిన వారికి చేరాలంటే చిరునామా సరిగ్గా ఉండాలి. అందులో ముఖ్యంగా

**"ఆరు అంకెల
గుర్తింపు అద్వితీయం
వేగంగా చేర" ..** అదే... పిన్ కోడ్ తప్పనిసరిగా రాయాలని సూచించారు

**"నిశి రాతిరి
శశి వెలుగులు కొంత
శమింపజేసే"**

వెన్నెల మనసులకు ఊరట కలిగిస్తుంది.శ్రమించిన దేహానికి ఉపశమనం కలిగిస్తుంది.

**"అంటి ముట్టని
వింత వైఖరే కదా
ఆకుపై బొట్టు"**

సమస్యలు వచ్చినప్పుడు, కష్టాలు ఎదురైనప్పుడు,తామరాకుపై నీటి బొట్టులా అంటి ముట్టనట్లు కొందరు దూరంగా ఉండడానికి ప్రయత్నం చేస్తారు. అలాంటివారు ఎప్పుడు ఎవరికి సహాయం చేయరు. అలాంటి వారిని మనం దూరంగా ఉంచడమే ఉత్తమం.

"మాటలు లేని
మలి వయసు ప్రేమ
చూడముచ్చటే "

జీవితంలో మనం వెంట తోడు నీడలా ఉండేది భార్య మాత్రమే. అన్ని బాధ్యతలు తీరాక ముదిమి వయసులో ఒకరికి ఒకరుగా.. ఒకరిలో ఒకరిగా... జీవిస్తూ స్వచ్ఛమైన ప్రేమ ఒడిలో సేద తీరడం... అదే మాటలు లేని మలి వయసు ప్రేమ..అనుభవిస్తే తప్ప తెలియదు.

**"కలికి కంట
కన్నీరు ఒలికిన
జాతికే చేటు"**

**యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః
యత్రైతాస్తు నపూజ్యంతే సర్వాస్త త్రాఫలాక్రియః.** ఎక్కడ స్త్రీలు పూజింప బడతరో,అక్కడ దేవతలు నివసిస్తారు. ఎక్కడ స్త్రీలు పూజింప బడరో అక్కడ కార్యాలన్నీ నిష్ఫలాలౌతాయి. ఎక్కడ నారి కంటిలో కన్నీరొలుకుతుందో అక్కడ దరిద్ర దేవత తాండ విస్తుంది. అందుకే స్త్రీలను హింసించినచోట సుఖసంతోషాలు ఉండవు. ఈ నిజాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని వివరిస్తూంది హైకు.

ఇలా ఈ వెలుగు పూలు హైకూ సంపుటిలోని హైకూలన్నీ ఏదో ఒక అర్థాన్ని పరమార్థాన్ని అందిస్తున్నాయి. విభిన్నమైన చిత్రాలతో కూడిన 88 అంశాలపై చక్కని హైకూలనందించిన రాజన్నగారికి అభినందనలు... శుభాకాంక్షలు..



- వైరాగ్యం ప్రభాకర్
9014559059





## సావిత్రిబాయి పూలే మహాగ్రంథం
# డా॥కత్తి పద్మారావు గారి కృషి నుండి ఆవిర్భవించిన సాంస్కృతిక విప్లవ క్రాంతి కిరణం



సావిత్రిబాయి పూలే అనే ఈ మహా గ్రంథాన్ని ఐదు సంవత్సరాలుగా పరిశోధించి మహాకవి అభినవ అంబేద్కర్ డా॥కత్తి పద్మారావు గారు వ్రాశారు. ఈ గ్రంథం వ్రాయడానికి సంబంధించిన దృక్పథాన్ని వారు వ్రాసిన పీఠికలో ఇలా కళ్ళకు కట్టినట్టు వర్ణించారు. భారతదేశ సాంస్కృతిక విప్లవ పోరాట స్ఫూర్తి సావిత్రిబాయి పూలే. స్త్రీ విముక్తి ప్రధాత, మానవాభ్యుదయ వికాస జీవన వ్యవస్థల పునర్ నిర్మాణకర్త. భారతదేశంలోని చారిత్రక మలుపులో నిలబడి జీవన జ్యోతులను వెలిగించిన మానవతా మూర్తి సావిత్రిబాయి పూలే అని అభివర్ణించారు. సావిత్రి బాయి పూలే జీవిత గాధ ఒక జీవన దృశ్యం. అందుకే ఈ పుస్తకం ప్రారంభంలోనే ఇలా విశ్లేషించారు. సావిత్రిబాయి పూలే భారత దేశంలో ప్రత్యామ్నాయ జీవన వ్యవస్థలు వెలిగించిన ఒక మహోజ్వల కాంతిదీపం. భారతదేశ చరిత్రను మలుపు తిప్పిన స్త్రీమూర్తి ఆమె. ఎవరైతే చరిత్రను మలుపు తిప్పుతారో వారికే యుగ కర్తృత్వం వుంటుంది. చరిత్రతో నడిచేవాళు మరణించిన తర్వాత తిరిగి లేవరు. చరిత్రను మార్చాలి అంటే త్యాగాలు కావాలి. త్యాగం అనేది ఒక ఆరిపోని దీపం. ఆమె చరిత్రను మార్చింది. అందుకే తిరిగి లేచింది. ఈ రోజుకి సావిత్రిబాయి పూలే భారతదేశంలో వెలుగొందుతుంది అంటే ఆమె త్యాగం, కృషి, పట్టుదల, నిజాయితీ, నీతి, విజ్ఞానం, విలువలు సావిత్రిబాయి పూలేకే సొంతం. ఈ దృక్పథంతో ఈ బృహత్తర గ్రంథాన్ని డా॥కత్తి పద్మారావు గారు ఎంతో పరిశోధనాత్మక సామాజిక, సాంస్కృతిక స్ఫూర్తితో వ్రాశారు. డా॥కత్తి పద్మారావు గారు రాసిన 92వ గ్రంథం ఇది. ఆయన ప్రతి గ్రంథం దళితుల, స్త్రీల, బహుజనుల విముక్తి మార్గాలను నిర్దేశిస్తుంది.

ఆయన ఈ గ్రంథాన్ని ఎన్నో శీర్షికలు, ఉప శీర్షికలతో వ్రాశారు. సావిత్రిబాయి పూలే తిరుగుబాటు, హిందూ యాగాలు – సంపద ధ్వంసం, సావిత్రిబాయి విప్లవకారిణి, సావిత్రిబాయి పూలేకి నేపథ్య ఉద్యమాలు, జ్యోతిరావు పూలే విప్లవ మార్గం, పోరాట వీరులు పూలే దంపతులు, వివేకవంతులు ఆ దంపతులు, పూలే దంపతుల పోరాట పటిమ, పూలే దంపతులపై సంత్ రవిదాస్ ప్రభావం, సావిత్రిబాయి మేధో సంపత్తి, జ్యోతిరావు ఆలోచనాపరుడు, పూలే, సావిత్రిబాయిల ప్రభావం, ఆనాటి శూద్ర, అతిశూద్ర కార్మికోద్యమం, సావిత్రిబాయి పూలే పోరాట కథ, సావిత్రిబాయి పూలే విద్యా విప్లవం, హిందూ పునరుద్ధరణ వాదం, పుక్కిటి పురాణాలు చీల్చిన పూలే వాదం, మహారాష్ట్రలో శూద్ర విప్లవం, శూద్ర, అతిశూద్ర రాజ్య వ్యవస్థల వాదం, జ్యోతిరావ్ పూలే, సావిత్రిబాయి పూలే పోరాట దృక్పథం, భాషలు అందరి సొత్తు, బ్రాహ్మణులు దోపిడీ దారులు, శూద్రుల శాస్త్రదాస్యం, సావిత్రిబాయి పూలే వెనక బుద్ధుడు, పుక్కిట పురాణ కథలను ఛేదించిన సావిత్రివాదం, సావిత్రితో ఫాతిమా షేక్, మనుస్మృతిని ఛేదించిన పూలే దంపతులు, పూలే సాహిత్య విప్లవం, సావిత్రిబాయి పూలే సాంస్కృతిక విప్లవం. ఈ పుస్తకాన్ని వ్రాయడం కోసం సుమారు వందకు పైగా పుస్తకాలు పరిశోధించాను. పొన్నూరు లుంబినీ వనంలోనే అంబేద్కర్ రిసెర్చ్ సెంటర్‌ను డా॥కత్తి



**ప్రతులకు:** కత్తి స్వర్ణకుమారి
లోకాయత పబ్లికేషన్స్, లుంబినీవనం
అంబేద్కర్ కాలనీ, పొన్నూరు–522 124
గుంటూరు జిల్లా. సెల్: 9849741659

పద్మారావు గారు నెలకొల్పారు. అది ఆయన స్వీయ గ్రంథాలయం. అందులో సుమారుగా 50 వేల పుస్తకాలు పైగా వున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో గృహ గ్రంథాలయాలలో అత్యంత పెద్దదైన గృహ గ్రంథాలయం ఇదేనని చెప్పవచ్చు. ఎక్కడా లభించని ఎన్నో ప్రాచీన గ్రంథాలు సైతం ఇక్కడ లభిస్తాయి. పద్మారావు గారు ఆ గ్రంథాలయంలోనే గడుపుతూ నిరంతరం అధ్యయనంలో ఉంటారు. భారతదేశ వ్యాప్తంగా, అంతర్జాతీయంగాను ఎందరో పరిశోధకులు ఈ గ్రంథాలయాన్ని తమ పరిశోధనకు ఉపయుక్తం చేసుకుంటున్నారు. వారు ఈ పరిశోధనకు ఉపయోగించిన ముఖ్యమైన గ్రంథాలు 1) Chatrapathi Shahu, 2) Jyothirao Phooley Birth and Background-Dhanujay Keer, 3) రామ మోహన రాయ్ నుండి ఎం.ఎన్.రాయ్ వరకు –ఎన్ ఇన్నయ్య, ఎం.ఏ.ఫిరోజ్ షా మెహతా, 4) Mahatma Jyothi Rao Phooley - Dhanujay Keer, 5) Mahatma Jyothi Rao Phooley Chapter III, The Banner of Revotunfurled- Dhanujay Keer, 6) Post - Hindu India, The Barbers Skill System, Kanche Ilaiah,7) దళిత మహర్షి సంత్ రవిదాస్ భక్తి కవితోద్యమం, 8) వస్తు గుణ దీపిక, 9) Remedies against Descrimination & Inequalities Ambedkar in Retrospect Essays on Economic Politics & Society - Sukhadeo Thorat Aryama 10) ఆధునిక భారతదేశ చరిత్ర, బిపిన్ చంద్ర. ఈ పేర్కొన్న గ్రంథాలన్ని క్షుణ్ణంగా చదివి మహాత్మా పూలే గ్రంథాలను కూడా లోతుగా అధ్యయనం చేసి ఈ గ్రంథం డా॥కత్తి పద్మారావు గారు వ్రాశారు. నిజానికి సావిత్రిబాయి పూలే భారతదేశంలో మరో స్వాతంత్ర పోరాటానికి పతాకాలు ఎత్తింది అని ఈ గ్రంథంలో పేర్కొన్నారు. **సావిత్రిబాయి పూలే భారతదేశంలో ప్రత్యామ్నాయ జీవన వ్యవస్థలు వెలిగించిన ఒక మహోజ్వల కాంతిదీపం. భారతదేశ చరిత్రను మలుపుతిప్పిన స్త్రీమూర్తి. ఎవరైతే చరిత్రను ములుపుతిప్పుతారో వారికే యుగ కర్తృత్వం వుంటుంది. చరిత్రతో నడిచే వాళ్లు మరణించిన తర్వాత తిరిగి లేవరు. చరిత్రను మార్చాలి అంటే త్యాగాలు కావాలి. త్యాగం అనేది ఒక ఆరిపోని దీపం. ఈ రోజుకి సావిత్రిబాయి పూలే భారతదేశంలో వెలుగొందుతుంది అంటే త్యాగం, కృషి, పట్టుదల, నిజాయితీ, నీతి, విజ్ఞానం, విలువలు సావిత్రిబాయి పూలేకే సొంతం అని గట్టిగా ఉద్ఘాటించారు.** నిజానికి భారతదేశంలో స్త్రీలు అణచివేతకు గురై విద్యాగంధం లేక బ్రాహ్మణాధిపత్య భావజాలంలో మగ్గిపోతున్నప్పుడు స్త్రీ వ్యక్తిత్వాన్ని ధ్వంసం చేసి, ఆమెను వ్యభిచారిగా చిత్రించి, ఆమె మనసు 'తోడేలు మనసు' అని వ్యాఖ్యానించి, ఆమెకు స్వేచ్ఛ ఇస్తే పురుష సంపర్కానికి తెగబడిందని ప్రకటనలు చేసి, స్త్రీని వంటింటి కుందేలుగా మార్చిన సందర్భంలో సావిత్రిబాయి పూలే సూర్య ప్రభాసమానమై స్త్రీ విముక్తి ఉద్యమానికి నడుం కట్టింది. ఈ పుస్తకానికి ప్రొఫెసర్ కె.యస్.చలం గారు పీఠికలో ఇలా విశ్లేషించారు. **డా॥కత్తి పద్మారావు గారు రచించిన సావిత్రిబాయి పూలే పుస్తకంకు ముందుమాట అవకాశం యిచ్చిన సోదరునికి ముందుగా ధన్యవాదాలు తెలియజేయాలి. తెలుగు ప్రజలకు జ్యోతిబా పూలేని పరిచయం చేయటం కోసం వై రామయ్య**

**ఈ రోజుకి సావిత్రిబాయి పూలే భారతదేశంలో వెలుగొందుతుంది అంటే త్యాగం, కృషి, పట్టుదల, నిజాయితీ, నీతి, విజ్ఞానం, విలువలు సావిత్రిబాయి పూలేకే సొంతం**

**గారి ద్వారా గులాంగిరిని, 1993లో అనువాదం చేయించాను. దానికి ముందు 1989లో పూనే విశ్వవిద్యాలయంలో సీప్ కాలేజీలో ఉపన్యాసం కోసం నన్ను ఆహ్వానించినపుడు అక్కడ పనిచేస్తున్న మిత్రుడు డా॥గోపాల్ గురుతో కలిసి కొత్తరోడ్‌లో వున్న మహాత్మాపూలే గడికి వెళ్ళటం, దళితుల కోసం పూలే తవ్వించిన నుయ్యి ఆ పరిసరాలు చూడటం జరిగింది. అప్పుడే మహారాష్ట్ర ప్రభుత్వం ప్రచురించిన పూలే సమగ్ర సాహిత్యాన్ని కొని తెచ్చాను. గతంలో కీర్ రాసిన పూలే జీవిత చరిత్ర కంటే సమగ్ర సాహిత్యం, గులాంగిరి నన్ను బాగా ఆకట్టుకున్నాయి. అయితే మహాత్మా పూలే గూర్చి తెలిసినంతగా ఆయన భార్య సావిత్రి బాయి పూలే గూర్చి తెలుగు వారికి ఇటీవల వరకు తెలియదు. ఈ మధ్య కొందరు సావిత్రి బాయి పూలేను ఆదర్శంగా తీసుకొని ప్రచారం చేస్తున్నారు. అయితే పద్మారావు గారి ఈ పుస్తకం చాలా విశ్లేషణాత్మకంగా, సావిత్రి బాయి పూలే ఉద్యమ చారిత్రక నేపథ్యం సవివరంగా ఇందులో చెప్పారు. మొత్తం 29 అధ్యాయాలున్న ఈ పుస్తకంలో పద్మారావు గారు ఆ నాలుగు గ్రంథాల్లో వివరించినట్లే సంస్కృతం, ఇంగ్లీషు రచనల నుండి వివరాలు సేకరించి పూలే దంపతుల ఉద్యమ నేపథ్యానికి కావలసిన తాత్విక భూమిక, నాటి బ్రాహ్మణ సమాజం ఆగడాలు, పూనాలో పీష్వాల భయంకర వర్ణ పీడన గురించి వివరించారు. అందుకే ఈ పుస్తకంలో సావిత్రిబాయి పూలే జీవితం, ఉద్యమం కంటే నాటి చారిత్రక, సాంఘిక, సాంస్కృతిక అంశాలకు ఎక్కువ పేజీలు కేటాయించారు. అందరూ చదవవలసిన గ్రంథం.** అందరూ చదవవలసిన గ్రంథం ఇదని ప్రొఫెసర్ చలం గారు తమ పీఠికలో వ్రాసారు. ఈ గ్రంథాన్ని సావిత్రిబాయి పూలే మార్గంలో నడిచిన శ్రీమతి కట్టా నాగేశ్వరి గారికి, క్రీ.శే.మండే మాధవి లత గారికి, క్రీ.శే.నేతల భారతి గారికి అంకితం చేశారు. కట్టా నాగేశ్వరి అక్క గారి గురించి చెప్తూ నాకు తల్లి సమానురాలు.. ప్రేమ సముద్రం మరో సావిత్రి బాయి పూలే, గొప్ప తల్లి, గొప్ప అక్క, గొప్ప సహచరిణి.. విద్యావతి, సహాయ నిధి..ఆత్మీయ దుర్గం, జీవన జ్యోతి.. నాకు నిరంతరం జీవం, మా అక్క (మా పెద్దమ్మ కూతురు) అని కొనియాడారు. మండే మాధవి లత గారి గురించి చెప్తూ ఆత్మీయ సోదరి, ప్రేమ మూర్తి, విద్యా నిధి, గొప్ప తల్లి, గొప్ప సహచరిణి అని విశ్లేషించారు. నేతల భారతి గారి గురించి చెప్తూ దళిత తల్లి..గొప్ప విద్యావతి, అత్యున్నతమైన మాతృమూర్తి, గొప్ప ఉపాధ్యాయురాలు, గొప్ప క్రైస్తవురాలు అని శ్లాఘించారు. ఈ ముగ్గురికి అంకితం ఇవ్వడం ఒక చారిత్రక అంశంగా భావిస్తున్నాను. మార్చి 8, 2025 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పొన్నూరు లుంబినీ వనంలో 'సావిత్రిబాయి పూలే గ్రంథం ఆవిష్కరించబడింది. డాక్టర్ కత్తి పద్మారావు గారి 92వ గ్రంథం ఇది. ఈ గ్రంథాన్ని ప్రతి ఒక్కరు చదివి దళితవాద ఉద్యమం , స్త్రీవాద ఉద్యమానికి కరదీపికగా చేసుకుంటారని ఆశిస్తున్నాను. 700 పేజీలు గల ఈ గ్రంథం విలువ కేవలం 600 రూపాయలు. ఈ గ్రంథ రచనలో డా॥ కత్తి పద్మారావు గారి సతీమణి మాతా రమాబాయి అవార్డు గ్రహీత మరో సావిత్రిబాయి పూలే అయినటువంటి శ్రీమతి కత్తి స్వర్ణకుమారి గారి సహకారం అనన్య సామాన్యం. ఈ ప్రతులు కావాల్సిన వారు మాతా రామాబాయి అవార్డు గ్రహీత, మరో సావిత్రి బాయి పూలే శ్రీమతి కత్తి

**ఈ గ్రంథం విద్యార్థినీ విద్యార్థులు, మహిళా ఉ ద్యమకారిణిలు, అభ్యుదయవాదులు, గృహిణీలు చదివి తీరవలసిన గ్రంథం.**

స్వర్ణకుమారి, అంబేద్కర్ రిసెర్చ్ సెంటర్, అంబేద్కర్ కాలనీ, పొన్నూరు–522124, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ వారిని సంప్రదించండి.

ఈ గ్రంథం విద్యార్థినీ విద్యార్థులు, మహిళా ఉద్యమకారిణిలు, అభ్యుదయవాదులు, గృహిణీలు చదివి తీరవలసిన గ్రంథం. ఈ గ్రంథం ద్వారా సావిత్రిబాయి పూలే జన్మదినాన్ని టీచర్స్ డేగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నాం. ఈ గ్రంథాన్ని ఎంతో శ్రమించి వ్రాసి జాతికి అంకితం చేసినందుకు మహాకవి, అభినవ అంబేద్కర్ డా॥కత్తి పద్మారావు గారికి హృదయ పూర్వక అభినందనలు తెలుపుకుంటున్నాను.

అందరూ ఈ గ్రంథాన్ని అధ్యయనం చేయవలసిందిగా ఆశిస్తున్నాను. ఈ గ్రంథం సావిత్రి బాయి పూలే జీవిత చరిత్ర మీద మొట్టమొదట తెలుగులో వచ్చిన ఉద్గ్రాంథంగా అభివర్ణిస్తున్నాను.

–గద్దం విజయరావు
9951299937



# నది కలిపిన జంట

కథ

వీస్తున్న గాలిలో నుండి అలల శబ్దాలు నాచెవులకు సోకగానే గిర్రున కండ్లు తిప్పి చూశాను. ఎదురుగా నది పాలనురగ పోతలతో ఉన్న నిలువెత్తు శిల్పం. తను నాతో ఏదో మెల్లగా చెబుతుంది. ఆ మౌనభాష నాకు అర్థం కాలేదు. ఎవరైనా వింటారనుకుందేమో! అయినా మళ్లీ మళ్లీ చెవిలో గుస గుసగా చెబుదామని అలలు అలలుగా తను నా దగ్గరకొస్తూనే ఉంది.

మెల్లగా మెల్లమెల్లగా నేను తనను తెలుసు కుంటానన్న ఆశ తన వదనంలో కనిపిస్తుంది. మరో వైపు ఎక్కడో దూరంగా కాలి అందెలు గల్లు గల్లు మంటున్న చప్పుడు. అక్కడున్నది మనిషా లేక దయ్యమా లేక మరి ఇంకేదైనానో అర్థం కావడం లేదు.

నేను కూర్చుండి చాలాసేపు అయింది. కకావికలమైన మనసుకుదుట పడలేక ప్రతి క్షణం అది నాతో సంఘర్షణ పడుతూ యుద్ధం చేస్తూనే ఉంది.

ఒంటరిగా ఆ ప్రదేశంలో చీకటి చీల్చుకుని పరుచుకున్న వెన్నెల. వెండి నురగల్లా మెరుస్తున్నది నది.

మా ఇద్దరి ఊసులతో మధ్య మధ్యలో సయ్యాటలాడుతున్న గాలి తప్ప అక్కడ ఎవరూ లేరు.

ఇద్దరం ఒకరి భావాలను ఒకరు పంచుకుంటున్నాం

మధ్య మధ్యలో అప్పుడప్పుడు ఓ నిర్లిప్తమైన మౌనం. జల జలా రాలుతున్న నా కన్నీళ్ళకు సాక్ష్యంలా ఉన్న అక్కడి ఇసుక రేణువులు నన్ను చూసి ఏమనుకుంటున్నాయో! నా బాధను జూసి ఓదార్చాలని అప్పుడప్పుడు గాలితో కలిసి నన్ను చుట్టుకుంటున్నాయి.

మళ్ళీ దూరంగా గల్లు గల్లుమంటున్న కాలి అందెల చప్పుడు. నాకు నేను సంబాలించుకుంటు చుట్టూ చూశాను. ఎవరూ లేరు అయినా ఇక్కడ ఈ అర్థరాత్రి ఎవరు ఎందుకుంటారు?

ఉదయం నుండి సాయంత్రం వరకు గుడిలో నుండి వినిపించే మంత్రాలు, నది స్నానాలు చేసేవారు, శ్రాద్ధ కర్మలు చేయించుకునే వారికి పూజలు చేసే బ్రాహ్మణులు,పూలు,కొబ్బరి కాయలమ్మేవారు, వేరుశనగ పల్లీలు అమ్మేవాళ్లు,జాలర్లు, చాపల కోసం వచ్చేవాళ్ల లేక కాలక్షేపం కోసం వచ్చేవాళ్ళు ఎవరో ఒకరు తప్ప నాలాగా ఎవరు ఎందుకు వస్తారు.

మనసు మధన పడుతుంది.

నేను చేసే ఈ పని సరైనదేనా? ఈ సమాజం నన్నే ఎందుకు ప్రశ్నయి చూస్తుంది? నేను బతుకుతున్న బతుకు నిజమేనా? నన్ను ఒంటరిని చేసిన ఈ వ్యవస్థను ఎదిరించలేక ఓడిపోయి, బ్రతకలేక పోతున్నాను.ఆత్మన్యూనత ఏదో నన్ను వెంటాడుతుంది.

ప్రవాహశబ్దం...

ప్రేమగా నది మళ్లీ మెల్లగా నా వైపు దారిమళ్ళీ నా వైపు చూసింది. నది నన్ను ఏదో

**మా ఇద్దరి ఊసులతో మధ్య మధ్యలో సయ్యా టలాడుతున్న గాలి తప్ప అక్కడ ఎవరూ లేరు**

అడగాలని ప్రయత్నిస్తుంది. ఎందుకో గాని అర్థం కాలేదు నేను కొద్దిసేపు నాకు నేనుగా తర్జనబర్జన పడ్డాక తెలిసింది.

తను నా బాధను తెలుసుకోవాలని ఆరాటం పడుతుందని. అయినా ఇప్పుడు నేను చెప్పుకోవడానికి కూడా ఇక్కడ ఎవరు లేరు. ఏ బాధైనా సంతోషమైనా చిన్నప్పటినుండి తనతో గాక నేను ఎవరితో పంచుకున్నాను.

నది కండ్లలోకి చూడగానే ఎందుకో అమ్మ ప్రేమగా ఆత్మీయతతో దగ్గరకు తీసుకొని హత్తుకున్న భావన కలిగింది.

హృదయాంతరాలలో నుండి తన్నుకుని వస్తున్న దుఃఖం ఇప్పుడు ఆవిష్కరింప చేయాలనిపిస్తుంది.

ఆకాశంలో జాబిల్లిని మేఘాలు చుట్టుముట్టాయి. వెన్నెల చీకటి తెరలను కమ్ముకుంది.

నది నా వైపు చూస్తూ నా పక్కనే కూర్చుంది.

"నేను చనిపోవాలనుకుంటున్నాను" మెల్లగా అన్నాను.

" నాకు తెలుసు" అంది నది.

" నేను ఎవరికీ చెప్పలేదు గదా! మరి నీకెలా తెలుసు'' ఆశ్చర్యంగా అడిగాను.

''నేను జీవితంలో ఎన్నో ఆటు పోట్లు తిని ముందుకు సాగుతున్నదానిని,ఎన్నో వందల ఏళ్లుగా ఇక్కడ కోటానుకోట్ల జీవుల బ్రతుకు చిత్రాలను చూసిన దాన్ని. ఎవరు ఏమిటి నాకు తెలియదా?" నా కండ్ల లోనికి సూటిగా చూస్తూ అంది నది.

నాకు దుఃఖం ఆగలేదు నదీ మా తల్లి పై పడి బోరున ఏడ్చాను.

"ఎందుకు ఏమైందని అంతలా దిగులు పడుతున్నావు" నా తలపై చేయి వేసి నిమురుతు అంది.

"ఒంటరి పక్షికి ఎంత కాలమమ్మ ఈ శిక్ష"

"శిక్షెందుకు హాయిగా స్వేచ్ఛగా బతుకవచ్చు గదా చక్కగా కాళ్ళు చేతులున్నాయి. అంతకన్నా గొప్ప అదృష్టం ఇంకెక్కడ ఉంది." నవ్వుతూ అంది నది.

"నేను అలా అనడం లేదు. నా బతుక్కు ఏం అర్థం ఉందమ్మా బాల్యం నుండి నన్ను ఈ దుష్ట సమాజం హింసిస్తూనే వుంది. అందుకే చనిపోవాలను కుంటున్నాను".

"ఐతే ఈ యవ్వనం"

"ఇంకా ఏముంది ఆశ.అంతా దుఃఖం తప్పా! అందుకే ఇలా..."

"చూడు ఈ సమాజం గాండ్రించే పులి. మనం భయంతో ఒక్క అడుగు వెనక్కి వేస్తే అది పది అడుగులు ముందుకేసి నిన్ను మింగాలని జూస్తుంది. ఎప్పుడైతే నువ్వు కూడా దానికి ఎదురు నిలిచి పోరాడి నిలుస్తావో అప్పుడే అది నీ నుండి దూరంగా పారిపోతుంది. మనిషికి ఈ జీవితం దేవుడిచ్చిన గొప్ప వరం దానిని వృధా చేసుకోవడం దేనికి? ఎవరు చేయాల్సిన విధిని వారు నిర్వర్తించాలి. నేను చేయాల్సిన పని నేను చేయడం లేదా! ఆ గాలి చేసే పని తాను చేయడం లేదా! ఎప్పుడైతే తాను ఒంటరినన్న భావన కలుగుతుందో అప్పుడే వారి వారి పతనం ప్రారంభమవుతుంది. అందుకే ఏ కష్టమైనా ఏ బాధైనా ఎదురు నిలిచి పోరాడినప్పుడే మన విలువ తెలుస్తుంది."

**'నది నన్ను సంధాన పరచడానికి ప్రయత్నిస్తుంది. నేను మౌనంగా చూస్తున్నాను.**

పూడుకుపోయిన గొంతులో నుండి పొంగుకుని వస్తున్న దుఃఖం ఎంతకు అగటం లేదు. జీవితం గురించి పాఠాలు తను ఎంత చెప్పినా నాకు శూన్యంలానే కనిపిస్తుంది. నేను నామనసులో ఒకటే అనుకున్నాను. అది చావు మాత్రమే దాన్ని ఎవరు ఆపలేరు. నన్ను తొలుస్తున్న ఆలోచనలు నన్ను ఇంకా ఎక్కడికో దూరంగా తీసుకెళుతున్నాయి.

గాలి మెల్లగా మళ్లీ చెవుల చుట్టూ చేరి నఖ శిఖపర్యంతం తడుముతు చెవిలో ఏదో గొనిగింది.

దూరంగా ఏదో అలికిడి ఎవరివో మళ్లీ కాలి గజ్జలు గల్లు గల్లు మంటున్న చప్పుడు వినిపించడంతో అటుగా చూశాను. ఎంత ప్రయత్నించినా గానీ అక్కడ ఏ ఆకారం కనిపించడం లేదు. అది అంతా నా భ్రమేమో! లేకుంటే ఈ సమయంలో ఇక్కడ ఆడమనిషి ఎందుకుంటుంది.పక్కకు తిరిగి చూశాను. నది లేచి కాస్త నా నుండి దూరంగా వెళ్ళింది.

అక్కడక్కడ చిన్న చిన్న అలలు సవ్వడిచేస్తూ వెళ్తున్నాయి. నేను ఇదే అదన అనుకోని చుట్టూ కలియ చూశాను. ఎవరూ లేరు ఈ సారి గట్టిగా దేవుడికి దండం పెట్టుకున్నాను. ఇక లేచి పరుగు లంకించుకున్నాను, అలా ఒడ్డున ఎంతసేపు పరిగెత్తానో చెమటతో ఒల్లంతా తడిసిపోయింది. మెదడులో ఆలోచనలు వేడెక్కినాయి. ఇక లాభం లేదు ఈ దుష్ట సమాజానికి దూరంగా నేను...నేనుగా... ఉండే ప్రపంచంలోకి వెళ్తున్నాను.

అనుకుంటూ ఒక్కసా రిగా సుడులు తిరుగుతున్న సుడిగుండంలోకి దుంకినాను.

నది నన్ను ఎత్తుకుని కొంత దూరం తీసుకు వెళ్ళింది. ఇక నా జీవితం ఈ అలల మధ్య అంతర్ధానం అవుతుంది, నా కనులు మూతలు పడ్డాయి, ఈ జీవనశకం ముగిసిందను కుంటు ఓ కొత్త ప్రపంచంలోనికి వెళ్తున్న వేదన. అది ఎంతో సేపు నిలవలేదు,తన రెండు చేతుల అలలతో నన్ను బంధించి ఒడ్డున పడవేసి ఉగ్రరూపిణియై కోపంగా నా వైపు చూసింది నది.

నాకు ఆ కళ్ళలోనికి చూడడానికి కాస్త భయం వేసింది. తడిసిన నా శరీరం గగుర్పొడిచినట్లయింది.

" ప్లీజ్ నన్ను చావనీయమ్మ నన్ను అడ్డుకోకు" దిక్కులు పిక్కటిల్లేలా అరిచాను.

పాలపొంగు లాంటి తన కోపం చప్పున చల్లారినట్లు శాంత స్వరూపిణిగా మారి ప్రేమగా నన్ను దగ్గరకు తీసుకుని మురిపెంగా మందలించింది.

**ఆమె కాలి అందెల చప్పుడుతో మా ఇద్దరి ఏడడుగులు ఇసుకపై జ్ఞాపకాల పాదముద్రల గురుతులు వేస్తూ కొత్త జీవితంలోకి అడుగు పెట్టాము.**

నది తల్లి మాటలు, తను చూపించిన ఆ ప్రేమ,ఆ లాలన నా గుండెను తాకింది. దాంతో నా కండ్లు ఆర్ద్రతైనాయి.

నది తల్లి వైపు ఆరాధనగా చుశాను.

అప్పుడప్పుడు దూరంగా వినిపించిన కాలి అందెల చప్పుడు ఇప్పుడు కాస్త దగ్గరగా వినిపించింది. నేను మెల్లగా తల ఎత్తి ఆమె వైపు చూశాను. అందమైన దేవకన్యలా ఉంది. నిజంగా దివి నుండి భువికి దిగి వచ్చిందేమో! అప్సరసల పోతపోసిన రూపం నా మనసును తన చూపుల సంకెళ్ళతో బంధించింది.నేను స్థానువులా కొయ్యబారిపోయాను.

" ఈ అమ్మాయి ఎలా ఉంది?"

"చాలా అందంగా ఉంది ఎవరమ్మ?"

"తను నీలాగే చనిపోవాలనుకుని వచ్చింది"

"ఏం తనకు ఎవరూ లేరా?"

"ఉన్నా లేనట్లే తనను పెళ్లి చేసుకో ఈ ప్రపంచం నువ్వు చావులో కోరుకున్న దానికన్నా కొత్తగా కనిపిస్తుంది.

నది తల్లి అనునయంగా అడుగుతున్న తీయని మాటలకు నా మనసు ఉప్పొంగింది. ఎందుకో ఆ అమ్మాయిని చూస్తేనాకు ఒదులుకోవాలనిపిం చలేదు. జీవితంలో నాకంటు మొదటిసారి వచ్చిన అవకాశం అది మరో జీవితానికి బాటలు వేసుకోవడానికి ఓ తోడు కావాలనిపించింది. ఎందుకో ఇప్పుడు అన్ని తానే అనిపిస్తుంది. నేను మెల్లగా సరే అన్నాను.

"తథాస్తు" అంది నది మా తల్లి.

నది మా ఇద్దరి చేతులను పంచభూతాల సాక్షిగా కలిపింది.

నా ఆంగీకం వైపు చూస్తూ అంతరంగిక పుస్తకంలోని భావాన్ని చదివిన దానిలా ఆమె నన్ను అల్లుకుంది.

మేము నది వైపు చూస్తూ కృతజ్ఞతా పూర్వకంగా నమస్కరించాము.

మహానది మమ్ములను ప్రేమగా దీవించింది.

ఆమె కాలి అందెల చప్పుడుతో మా ఇద్దరి ఏడడుగులు ఇసుకపై జ్ఞాపకాల పాదముద్రల గురుతులు వేస్తూ కొత్త జీవితంలోకి అడుగు పెట్టాము.

××××

"ఒరేయ్ లేవరా తెల్లారింది ఇంకా ఆ కలవరింతలేంటి" దుప్పటి కప్పుకుని పడుకున్న నన్ను నిద్ర లేపింది మా అమ్మ.

"మహానది .....దేవకన్య ... " అంటూ నేను ఉలిక్కిపడి లేచి చూశాను.

"అయ్యో! అమ్మ ఎవరు లేరేంటి?" అమ్మ వైపు చూస్తు అన్నాను.

" కలగన్నావా? రోజు రోజుకు నీ కలల పిచ్చి ముదిరి పీక్ స్టేజికి పోతుంది. ఐనా రాత్రి అమ్మాయి గురించి పెళ్లి గురించి ఆలోచిస్తూ పడుకున్నావేమో అందుకే అదే కలై ఉంటది. నిజమేనా? అంది అమ్మ.

"అంత ఖచ్చితంగా ఎలా చెప్పావు? అమ్మా"

"సైకాలజిస్టును కదా! మనం ఏదైన విషయం ఎక్కువగా ఆలోచించుతామో అది మైండ్ సబ్ కాన్సేస్ చేరి రాత్రుల్లు గాఢ నిద్రలోకి జారుకున్నాక అదే ఆలోచన ఏదో ఒక రూపంలో మనకు కలగా వస్తుంది" అమ్మ చెప్పగానే నేను మంచంలో నుండి ఆలోచించుకుంటూ దిగాను.

"త్వరగా వెళ్ళు మనం ఈ రోజు అమ్మాయిని చూడడానికి వెళ్తున్నామన్న సంగతి మరచిపోయావా?

ఆ మాటతో నేను గబుక్కున బాత్రూం లోకి దూరి నా పనులన్నీ చేసుకుని వచ్చి "అమ్మ నేను రెడీ" అన్నాను.కారు తీసుకుని అమ్మాయి వాళ్ళ ఊరు వెళ్ళాము.

అమ్మాయి వాళ్ళు మమ్ములను ఇంట్లోకి స్వాగతించారు. సినిమాలోలా అమ్మాయిని మేడ మీద నుండి తీసుకొని మెట్లపై నుండి వస్తుంటే గల్లు గల్లు మంటు కాలి అందెల చప్పుడు నా చెవులకు చేరగానే తల ఎత్తి చుశాను తను ఆమె! నేను తననే చూస్తూ లేచి నిల్చున్నాను. తను నా కలలోని దేవకన్య, నదీ మా తల్లి కలిపిన దేవత! ఇలా మిరాకిల్ జరగడమేంటి అని దేవునికి నది తల్లికి పదే పదే కృతజ్ఞతలు చెప్పుకున్నాను.

"తనే అమ్మాయి చుశావా?" అమ్మ నాన్న చిన్నగా అన్నారు.

"తెలుసు రాత్రి కలలో దేవకన్య"

"అవునా" అంటు వాళ్ళు అవాకయ్యారు.

తను దగ్గరకు రాగానే అవే కాలి అందెల చప్పుడు మళ్ళీ నా మనసులో శృతిమీటాయి.

అమ్మాయి టీ కప్పునిస్తు తన్మయత్వంతో నన్ను చూసింది.

రాత్రి కలలో ఇసుకలో నడిచిన ఏడడుగుల పాదముద్రలు మనసులో మెదిలాయి.

"అమ్మాయి నాకు నచ్చింది" అందరికి వినిపించేలా గట్టిగా అన్నాను.

అమ్మాయికి కూడా నేను నచ్చడంతో పెద్దలు పెండ్లి నిశ్చయించి పురోహితుడితో లగ్నపత్రిక రాయించారు.

'బహుషా పెండ్లిల్లు స్వర్గంలోనే నిర్ణయించబడతాయంటే నిజమేనేమో! కలలో నేను నది ఒడ్డుకు వెల్లడమేంటి ఓ అమ్మాయిని చూపి నది మమ్ముల కలవడమేంటి, అదే అమ్మాయి నిజజీవితంలోకి రావడమేంటి'.

పదిహేను రోజుల వ్యవధిలోనే మా పెండ్లి అంగరంగ వైభవంగా జరిగింది.

ఇదంతా భగవంతుడి లీలల అనిపించింది. దాంతో దేవుడికి మనసులోనే " థాంక్స్ "చెబుతు బెడ్ రూం గది డోర్ వేశాను.

– వజ్జీరు ప్రదీప్
9989562991



## గాయాల గాయని!

మా ఇంటెన్క బాలక్క
రాగం తీసి పాడుతుంటే,
రాళ్లైనా కరుగుతయనిపించేది! .
మాయదారి మాయలోకం,
ఆడదానికి పాటెందుకని అన్నప్పుడల్లా,
"నీ గొంతెత్తి పాడే అక్క.." అని
గట్టిగా అరవాలనిపించేది!.
ఐతారం దినం నాడు,
టీవీ సూడనికని అలింటికి పోతే,
తిన్నవారా? అని అన్నమేసిచ్చి,
టీవీలచ్చే పాటలన్నీ
ఇనసొంపుగ పాడే బాలక్కకి,
తమ్ముస్నె ఎందుకు
పుట్టలేదా అని ఏడ్చేవాడిని
ఆడతనపు పాటనే కాదు,
ఆమెనీ వెలివేసింది,
పదహారేళ్లు నిండాయో లేదో,
పెళ్లి పాటని పాడమని
లోకమంతా కోడై కూసింది
ఆ గేయపు గాయాలు,
గుండెల్లో ముళ్ళ పొదలని పెంచాయి!
పాటలు పాడకుండా ఆపే ఆ గొంతులు,
ఏనాడు మూగబోతాయో,
ఆ దినం వేయి గొంతుకల్తో,
తన తల్లి రాగాన్ని ఎత్తుకొని,
గుండెలవిసేలా పాడుతుంది
తన నోటిని కుట్టి వేయొచ్చు,
తన గొంతుని కొడవలితో కొయ్యొచ్చు
కానీ,
తన గుండెల్లో నిండుకున్న పాటనేం చేస్తారు?
ఆమె ఇప్పుడు ఒట్టి గాయని కాదు,
గాయాల గాయాన్ని
నిశ్శబ్దం తెగిపడేంత గట్టిగా పాడే,
గాయాల గాయని!

–బాలాజీ పోతుల
8179283830



## మనసుతో ప్రేమించు

ప్రేమంటే రెండక్షరాలు కాదు
రెండు మనసుల కలయిక
తొలిచూపులోనే నచ్చావంటూ
వెంటపడేవారిని ప్రేమికులంటారా?
సెల్లో సొల్లు కబుర్లు చెప్పుకొంటూ
వేళాపాళా లేకుండా చాటింగులు చేస్తూ
క్లబ్బులూ పబ్బులూ తిరిగే జంటల్లో
నిజమైన ప్రేమికులు ఎందరు?
లేని పుట్టినరోజుల్ని సృష్టించుకుని
ఖరీదైన కానుకలను ఇచ్చిపుచ్చుకుని
జేబులూ పర్సులూ గుల్లచేసుకునే
కృత్రిమ ప్రేమలో నిజాయితీ ఎంత?
ఈ రోజుల్లో నిలువెల్లా ప్రేమ మైకం కమ్మి?
సహజీవనమనే నీచ సంస్కృతితో అంటకాగి
కన్నవారికి తలవంపులంటగట్టి
చివరికి మోసపోవడం అవసరమా?
ప్రేమ పెళ్లయినా.. పెద్దలు కుదిర్చిందైనా
ఒకరి మనసు మరొకరు అర్థం చేసుకుంటే
ఆ జంట వైవాహిక జీవితం నూరేళ్ల పంట
ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తాయి వారింట!

–శర్మ సీహెచ్
9440587567



## సుపత్రులను పోషిస్తున్నై

కనిపించని ధూళి కణాలను నింపుకున్న గాలి కాలుష్యం
శ్వాస పీడితుల్నిచేసి మెడిసిటీ మెరుపురంగులు దిద్దుకుని
రోగకిరీటాలు తగిలించుకుని పట్టాభిషేకం జరుపుకుంటున్నై
విరమించని పరుగులతో.
రేతిరి కండ్లకు వెలుగులు అంటించుకుని
రెప్పలకు బాధ్యతల గుంజలను నిలబెట్టి.
దేహాలను కార్యశీలతల్లో నిమగ్న పరుస్తు నగర పురోభివృద్ధికై
పల్లె సామాన్యుని తపన.
ఆరోగ్యమైన పల్లెలు.
ఆకలితో పాడెలు కట్టుకుంటున్నై నిరుద్యోగంతో కాలేపొట్టను
చేతపట్టుకుని పట్టణాలకు వలసల యానం
బతుకు జీవుడా అంటు.
కల్తీ వంటసరుకులతో.
నాలుకలను ఉసిగొలిపే.
విషపదార్థాల రుచులు
అనారోగ్య నగరాలై
ఆస్పత్రులనే పోషిస్తున్నై.
సేంద్రియ సేద్యం అమ్మ పాలలా.
పోషకాలు పోషణ పటిష్ఠతకు.
ఒక్కప్పుడు పతీకలైతే.
కృత్రిమ రసాయన సేద్యం
మట్టిని మరిపించి తనే.
అమ్మైనట్టు డబ్బా పాలతో.
అనర్థం( చేటు)తలపెడుతుంది.
మట్టి కణాలను ఆస్వాదించించి.
స్వచ్ఛత,నింపుకున్న దేహాలు.
నికచ్చి తత్వాన్ని నింపుకుని.
మలినం అంటని మనసులు
నిజాన్నే నమ్ముకున్నాయి.
కల్తీ క్రిమి రసాయనాలు.
చీడలను మట్టుబెట్టక!
ఆరగించే ధాన్యంలో మెండుగ.
విషబీజాలు నాటుతున్నై
అత్యాధునిక నాగరిక సమాజంలో.
లోపభూఇష్టమైన ఆలోచనలు.
స్వైరవిహారం చేస్తూ సజీవ.
మారణహోమం సాగిస్తు.
ధూళి కణాలతో నిండిన గాలి
శ్వాసలను హరించినట్టు
స్వార్థ చింతన నగరాన్ని.
కలుషితం చేస్తు మానవాలి.
ఆయుష్ ప్రమాణాలనే శాశిస్తుంది.
నవ నాగరిక ప్రపంచం.

**-యరకల యాదయ్య.**
9866468979.






నిర్వహణ
-కందుకూరి శ్రీరాములు
-బెల్లంకొండ సంపత్ కుమార్

**తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం - కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..**

## అదే తంతు

దార్శనికుడి జయంతి
ఫోటోలు సిద్ధం,పాలు సిద్ధం
దండలుసిద్ధం,ఉపన్యాసాలు సిద్ధం
బైకులు సిద్ధం, ర్యాలీలు సిద్ధం.
పాలాభిషేకాలు పూర్తయ్యాయి
ర్యాలీలతో రాజ్యం దద్దరిల్లింది
ఉపన్యాసాలు దంచి కొట్టారు
జనం ఊగిపోయారు.
తెల్లారింది
ర్యాలీలో తిరిగిన బైకులన్నీ
వైన్స్ ముందు నిద్రలేచాయి

**- ఎన్.నరేశ్ చారి**

## ట్విట్టర్ ట్విట్టర్ పిల్ల పక్షి !!

తల్లి పక్షిలాగే పిల్లపక్షి ముక్కుతో
గూడును మేడకన్నా గొప్పగా
అల్లుతుంది
తుఫానూ గాలి వాన వచ్చిపడ్డా
గూడు కింద పడదు
పడని గూడును చూస్తే చెట్టుకూ
ధైర్యమే తాను కూడ విరిగి కూలనని
తల్లి పక్షి పిల్లపక్షి గొప్ప గురించి
ఇరుగుపొరుగు పక్షులన్నింటితో ట్వీటర్
ట్విట్టర్ గా సందడి
పిల్లపక్షి ఆకాశమంతా తిరిగి తిరిగి
తల్లిపక్షికి విశేషాలు చెపుతుంది !!
నేటి పిల్ల పక్షి రేపటి తల్లి పక్షి !!

**-కందాళై రాఘవాచార్య**
8790593638

## అమరుడా అంబేద్కరుడా!

అమరుడా అంబేద్కరుడా
మా బాధలచీకట్లుబాపి
వెలుగుల్ని పంచుతున్న భాస్కరుడా
అమరుడా అంబేద్కరుడా
మా కష్టాల కన్నీళ్లను తుడిచి
ఆనందంగాబ్రతకమని
దారిచూపుతున్న దార్శనికుడా.
దేశదేశాల రాజ్యాంగాలు వడబోసి
అతిపెద్ద లిఖితరాజ్యాంగం రాసి
స్వేచ్ఛా జీవితం మాకిచ్చావు
హక్కులు,విధులు,ఆదేశ సూత్రాలు ఎన్నో
మారుతున్న కాలానికి మార్పు చేర్పులు ఎన్నో
గ్రంథాలెన్నో చదివిన ప్రపంచ మేధావి
శాంతిభద్రతలో ఘనతంతా నీదే ఓ ధన్యజీవీ!
బడుగుల శ్రమనుదోసే
భూస్వాముల అణచివేతల్ని వెనక్కు నెట్టి
అల్పజీవుల వెట్టిని తుదముట్టించి
కారే చెమటబొట్లకు విలువగట్టి కడుపునింపావు
తూటకంటే ఓటే ఆయుధమని
దేశం నుదుటిన
ప్రజాస్వామ్య తలరాతను వ్రాశావు
సమసమాజరాజ్య స్థాపనకోసం పరితపించి
సామ్యవాద శంఖం పూరించినావు
అణగారినవారికి రిజర్వేషన్ చేయూతనిచ్చి
అవని పైవాళ్లకాళ్ల పై వాళ్లను నిలబెట్టావు
ఆడవాళ్ళకు తండ్రిగా,అన్నగా అండగానిలిచి
రక్షణ గొడుగయ్యావు
అందరం సమానమన్నావు
అడుగడుగునా నువ్వే ఉన్నావు
భిన్నత్వంలో ఏకత్వంగా
భాయి భాయిగా కలిసి
బ్రతుకుటకు మూలం నీ రాతలు
ఆసేతుహిమాచలం
నీ బుద్ధిబలం చలవే మా జీవితాలు
అమరుడా అంబేద్కరుడా
మా బాధల చీకట్లుబాపి
వెలుగుల్ని పంచుతున్న భాస్కరుడా
మా కష్టాల కన్నీళ్లను తుడచి
ఆనందంగాబ్రతకమని
దారిచూపుతున్న దార్శనికుడా.

**-రమేశ్ నల్లగొండ**

## చేతనా శిల్పి

అంబేద్కరుడా అణగారిన కులాల
కుడి భుజమా
దేశము నిండా కులం గోడలు
ఇంకా నిగనిగలాడుతున్నవి.
మనుషులను ఇద్దరూగా చేసి వేలితో చూపిస్తున్నవి
ముఖాలకు కులం మసి పూసి అద్దంలో చూపిస్తున్నరు
మనుషుల మధ్య ఎందుకో ఈ భేదం
కడుపు కూడు కోసం అల్లుకున్న
వృత్తిని
నా నుదుట బొట్టు పెట్టి అందరిలో
డప్పు కొడుతుంటే మనిషినని మరిచి కులంతో
కూలిపోతున్న
మనుషులలో కాలిపోతున్న
చెట్టుకు, గుట్టకు, పుట్టకు, నీటికి,గాలికి,నేలకు,
ఎండకు, వానకు, మేఘానికి, అంటనిది
నాకెందుకు అంటుతుందో ఏమో
అంబేద్కరుడా మరల ఒక్కసారి వచ్చిపో
ఈ కులం గోడలన్నింటినీ కూలగొట్టడానికి
కొత్త సమాజాన్ని చెక్కడానికి

**-గుండెల్లి ఇస్తారి**
9849983874



## కనుము వినుము

రాద్రనారసింహ రావురూకులలోన
జీర్ణ దేవలమ్ము జీవమొచ్చి
ప్రజలభక్తి కొరకు ప్రారంభ మయ్యెను
కనుము వినుమురోరి కందుకూరి.
వైభవమ్ముతోడ వైశాఖ పూర్ణిమ
రాత్రి ఊరు చుట్టు రథము తిరుగు
కాంచటానికైన కన్నులు చాలవు
కనుము వినుమురోరి కందుకూరి.
రావురూకు లంటె రమ్యమైనది ఊరు
ఊరు చుట్టు ఏడు ఊర్లు గలవు
తలను తన్నె మర్రి తాటంత ఎత్తుండె
కనుము వినుము రోరి కందుకూరి.

**- కందుకూరి శ్రీరాములు**
9440119245



అంశం : మామిడి పండు

పేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో డా. రావి రంగారావు 2024 నుండి నిరంతరాయంగా నిర్వహిస్తున్న వారం వారం కవితల వర్క్ షా2025 "వారం వారం కవితల వర్క్ షాప్" 11 కు మొత్తం 11 మంది కవులు తమ కవితలు పోస్ట్ చేశారు. రెండు కవితలకు మాత్రమే ప్రశంసా పత్రాలు లభించాయి.

## వచన కవితలు

### ఫలరాజు మామిడి పండు

ఇంటికి ఆత్మీయుడు వచ్చి నిలిచినట్లు
మధురమైన కబురు విన్నట్లు
రసన రసాతలంలోంచి పెల్లుబికినట్లు
పండుగ నిండుగా ప్రత్యక్ష మైనట్లు
వేసవి కాలం సత్తువ వరంగా వచ్చినట్లు.
నిండు చందురుడు పసుపురంగు పులుముకున్నట్లు
మధుపములు అమృతం తెట్టె అందించినట్లు
ఏడాది నుండి ఎదురు చూసిన రసాస్వాదన
ఎదురొచ్చినట్లు
దివి నుండి అమృతం ఫలమై కనిపించినట్లు
ఆమ్ర ఫల పరిమళము మనసు గెలిచి నిలిచె...
ఆ రస రాజు కొసరి కొసరి పట్టముగట్ట వచ్చె...
వేసవి విడిది అమందానంద మయ్యె
చేతి కందిన పండు పై భాగము తొడిమ తీసి
నోటి కందీయ రసప్రవాహ
మాధుర్య మహిమ యేమొ!
స్వర్గ సుఖములైన వలదు వలదనిపించి
మత్తులో ముంచి ఓలలాడించు
వలరాజు ఫలరాజు మామిడి పండు

**-అనుముల బదరీనారాయణ,**
బెంగుళూరు.

### రస రమ్య కావ్యం

పేరుకే నేను నా తల్లికి బిడ్డను!
నన్ను కంటికి రెప్పలా
పెంచిన నా అన్నని
ఎన్నటికీ మరువను!.
నాపై గంపెడు ఆశలు పెట్టుకున్న
బక్క మనిషి అతడు.!
తన పంచప్రాణాలను
నాకోసం తాకట్టు పెట్టాడు.!
నేను పెరిగి పెద్దయి
ఉద్ధరిస్తానని నమ్మిన
ఒట్టి మట్టి మనిషి అతడు.!
తనకు కొండంత ఆస్తి
నాలోని రోగనిరోధక శక్తి.
నేను పచ్చగా పెరగకుంటే
పచ్చడి కూడా దొరకదు తనకి .!
నాలోని గుణగణాలు
నన్ను తీసుకెళతాయి
అగ్రరాజ్యాలకి.!
నాలోని సద్గుణాల
విలువను బట్టి
పెంచిన ఫలితం
దక్కును అన్నకి.!.
నా తీపి ముద్దు కోసం
ఎన్నో పెదవులు
పరితపిస్తాయి .!
నా దర్శన భాగ్యం కోసం
కాలం సైతం
కాపు కాస్తుంది .!
ఆనందం ఆరోగ్యం
రెండింటిని అందించే
రుచికరమైన శక్తిని నేను!
పుట్టింటి నుండి
మెట్టినింటికి చేర్చబడే
మమకారపు పచ్చడిని నేను!
అందరి మన్ననలను
అందుకునే రసరమ్య కావ్యాన్ని.!
నేనొక మధ్యవర్తిని,
ముత్తదువకు దండం పెట్టి
నన్ను ముత్తైదువు చేతిలో పెట్టి
పొందుతారు ఆశీస్సులని...
నేనో వంతెనని
దేవునికి పూజ చేసి
నైవేద్యముగా నన్ను చూపి
చాటుతారు భక్తిని...
వెరసి నేనో మామిడిని
నన్ను ఆరాధించుటలో
ఆరితేరెను తెలుగు సంస్కృతి...

**-లీలాకృష్ణ.**

# విరి తోటలో పూసిన కుసుమాలు

పుస్తక సమీక్ష

మనిషిగా పుట్టిన ప్రతి ఒక్కరి జీవితంలో ఎన్నో సంఘటనలు, అనుభవాలు ఎదురవుతుంటాయి. వాటికి స్పందించే హృదయం కలవారు తమ భావాలను, స్పందనలను సృజనాత్మకంగా వెలిబుచ్చడానికి ప్రయత్నిస్తారు. సమాజంలోని రుగ్మతలను తొలగించడానికి ప్రయత్నిస్తారు. ఉత్తమమైన సమాజ నిర్మాణం కోసం పాటుపడతారు. అలా తను చూసిన సంఘటనలను, పొందిన అనుభవాలను, వ్యక్తుల భావనలను, వ్యక్తిత్వాలను పరిశీలించిన అన్నమరాజు సుమాల్యా గారు వాటిని తన సృజనతో కవిత్వరూపంలో తీర్చి దిద్దారు.



ప్రతులకోసం :
డా.అన్నమరాజు సుమాల్య
సెల్: 9989819402

తాను కవికులంలో పుట్టిననదాన్నని, పద్యం గద్యం నా రెక్కలని, సమీక్షలు నా సౌరభమని, పఠనమని నా చిరునామాయని, సహృదయత నా ఇంటి పేరని అంటూ సాహిత్యం పట్ల, రచనల పట్ల తనకున్న మక్కువను "నేను" కవితలో ప్రకటించారు. అంతేకాకుండా రాగద్వేషాలు లేకుండా పరోపకారం చేస్తూ, మంచికి పాటుపడుతూ, మానవీయతకు సాకారంగా నిలవాలని కోరుకున్నారు.

గొప్ప పండిత వంశస్థులైన ముదిరాజు వారు పితామహులుగా పెండ్యాల వంశపు వారు మాతామహులుగా పొందిన సుమాల్య గారు తన మూలాలను మర్చిపోలేదు. అందుకే సాహిత్య రంగంలోకి అడుగిడి కవన కుసుమాలు పేరుతో కవితా సంపుటిని తీసుకువచ్చారు. చిన్నప్పటి నుంచి వీరికి సాహిత్యం అంటే మక్కువ. కళలు అంటే ఇష్టం.

"మీ ఆనందాన్ని సంతోషాన్ని
మా కోసం పణంగా పెట్టారు"

అంటూ తండ్రిని ఎత్తుగా కనిపిస్తున్న పర్వతాలతో పోలుస్తూ, అంత ఉన్నతమైన మనసు గల తండ్రిని "ప్రేమైక మూర్తి" కవితలో స్మరించుకున్నారు. మరో కవిత "మా నాన్న"లో

"తన భుజస్కందాలపై కుటుంబ
బరువు బాధ్యతలను మోస్తున్నా
తన అలసటని ఏనాడు తెలుపని
చిరునవ్వుకు చిరునామా నాన్న"

అంటారు

"నాకు సాహిత్యపు అస్తిత్వం కల్పించి
నిదురోతున్న నన్ను తట్టి లేపి" న పెదనాన్నని గుర్తు చేసుకోవడంలో బాంధవ్యాలకు కవయిత్రి ఎంత విలువిస్తుందో మనకు తెలుస్తుంది. అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన అమ్మ ప్రేమని "అమ్మ జ్ఞాపకం" కవితలో జ్ఞప్తికి తెచ్చుకుంది.

"రేపటి పౌరులు" శీర్షికన భావి భారత పౌరులకు మంచి సూచనలు అందిస్తూ ఉత్తమ మార్గాన్ని సూచించింది. వినయమే భూషణమని, గురువుల మాటలు వినాలని , చక్కగా చదివి ఎదగాలని, మన జాతి గౌరవం నిలపాలని పిల్లలకు పిలుపు నిచ్చింది.

ప్రియుని రాకకై ఎదురుచూస్తున్న ప్రియురాలి భావనలను విరహవేదనలను ఎదురుచూపు కవితలో చక్కగా వివరించారు.

"నటనే లేని నా భాష
తెలంగాణ భాష
కృత్రిమ రంగు పులమని
స్వచ్ఛమైన పచ్చని ప్రకృతి
నా తెలంగాణ భాష" అంటూ

తెలంగాణ సంస్కృతి సాంప్రదా యాలను, పండుగలను జీవన విధానాన్ని "తెలంగాణ కవిత"లో పరిచయం చేశారు.

ఎవరి ప్రమేయం లేకుండా ఏ ప్రతిఫలాన్ని ఆశించకుండా ప్రకృతి లోని చెట్లు, జంతువులు ఉపకారం చేస్తున్నాయి. సూర్యుడు ఉదయిస్తాడు. మబ్బులు వర్షాన్నిస్తాయి. చెట్లు పండ్లనిస్తాయి, చంద్రుడు వెన్నెలని కురిపిస్తాడు. మరి మనిషి! నీ మాటేమిటి? అంటూ మనల్ని నిలదీస్తూ ప్రశ్నించిన కవిత "సూర్యుడు ఉదయిస్తాడు"

కృష్ణుడిని తులాభారంతో చేయించిన తులసిని లక్ష్మీనారాయణ స్వరూపముగా, పుడమిన అవతరించిన లక్ష్మి మాతగా స్తుతిస్తూ అందించిన కవిత "తులసి"

"పాడిపంటల ప్రకృతి రమణీయతకుపెట్టింది పేరు మా ఊరు మా పల్లెటూరు" అంటూ పల్లెటూరు వాతావరణన్ని దృశ్యరూపకంగా మన ముందు నిలిపారు.

ఇంకా ఈ పుస్తకంలో శ్రీనివాసుని తిరుమల క్షేత్రము, కవిత్రయ మహాభారతము, జంట నగరాల్లో ఒకటైన హనుమకొండ , హైదరాబాద్ నగరము , ఆదర్శ పురుషుడు నెలకొన్న భద్రాచల క్షేత్రముతో పాటు దేవాలయము, గ్రంథాలయము, వైద్యాలయం, లలిత కళలను కవితా వస్తువులుగా తీసుకొని సరళమైన భాషలో అందరికీ అర్థమయ్యే రీతిలో చక్కని కవితలుగా మలచి అందించారు.

వేద వాంఙ్మయములకు నిలయమని, అక్కడి మట్టి కూడా పవిత్రమెనదని వేనోళ్ల పొగడబడుతున్న భారతావని విముక్తికై అహింసనే ఆయుధంగా మలచి స్వాతంత్ర్యమునందించిన గాంధీపై "బాపూజీ" శీర్షికన చక్కని కవితను కూర్చి ఇందులో పొందుపరిచారు. అన్నా చెల్లెళ్ల మధ్య ప్రేమబంధమైన రక్షాబంధనాన్ని కవితా రూపకంగా అందించారు.

సుమల్యా అన్నమరాజు గారు రచించిన కవన కుసుమాలు పలు రకాలైన పూల మొక్కలతో శోభిల్లుతున్న అందమైన విరితోటలా విభిన్నమైన అంశాలతో కూడి ఉంది. వీరు కవిత్వ రచనలో మరిన్ని మెళకువలు నేర్చుకుని మరింత చిక్కని కవిత్వాన్ని అందించడానికి ప్రయత్నిస్తారని ఆశిద్దాం.



**- వైరాగ్యం ప్రభాకర్**
9014559059

## చీమ ధైర్యం



నరసింహపురంలో నివాసం ఉంటున్న ఒక చీమ చాలా ధైర్యం కలది. అది ఒకసారి తన తోటి చీమలతో తాను అడవికి వెళ్లి సింహం చేత మెప్పు పొంది వస్తానని తెలిపింది. ఆ మాట విని ఇతర చీమలన్నీ దానిని గేలి చేశాయి. దానికి పట్టుదల ఎక్కువై అది అడవికి బయలు దేరింది.

అది అక్కడక్కడా ఆగుతూ నెమ్మదిగా వెళ్లింది. అలా ఆగుకుంటూ వెళ్లేసరికి దానికి అడవిలో ఉన్న విషయాలన్నీ తెలిశాయి. అది సరాసరి సింహం గుహలోనికి వెళ్లి సింహం జూలులో ప్రవేశించింది . అప్పుడు సింహానికి గిలిగింతలు పెట్టినట్లు అయింది. ఆ సింహం చీమను తీసి దూరంగా విసరివేసింది. అయినా ఆ చీమ తన ప్రయత్నం మానక తిరిగి మెల్లగా మళ్లీ సింహం వద్దకు చేరుకుంది.

ఇంతలో అక్కడికి వచ్చిన నక్క సింహంతో " మృగరాజా! హరిణం అనేపేరు గల జింక నిన్న మీ గురించి చాలా చెడ్డగా ఏమేమో మాట్లాడింది. మీరు దాన్ని శిక్షించాలి "అని అంది . అది విన్న సింహం "ఓ నక్కా! అది అలా మాట్లాడే సమయంలో మన అడవి ప్రాణులు ఏవైనా ఉన్నాయా !"అని ప్రశ్నించింది . నక్క " ఏవీ లేవు మృగరాజా!నేను మాత్రమే ఆ మాటలను విన్నాను. దాని స్వభావం మంచిది కాదు" అని అంది.

అప్పుడు అక్కడే ఉన్న చీమ " మృగరాజా ! ఈ నక్క చెప్పేది అంతా అబద్ధమే ! నేను అక్కడినుంచే వచ్చాను. ఆ జింక చాలా మంచిది. ఈ నక్కనే అబద్ధాలు ఆడుతోంది. అది మీ ద్వారా జింకను చంపించి మీరు మిగిల్చింది తినాలని దాని ఆశ. అందుకే అది దానిపై చాడీలు చెబుతున్నది"అని ధైర్యంగా అంది. అప్పుడు సింహం "ఓ చీమా!నీవు చెప్పిన మాటలు నిజమేనన్న నమ్మకం ఏమిటి?" అని ప్రశ్నించింది. "మృగరాజా! మీకు నా మీద నమ్మకం లేకుంటే దాని నివాసంవద్ద గల చెట్టు మీదనే ఉన్న పావురం, చిలుకను పిలిపించి అడగండి. వాటికి ఆ జింక గురించి చాలా తెలుసు" అని అంది. వెంటనే సింహం కాకితో వాటికి కబురు పంపించింది.

కాకి కబురుతో ఆ చిలుక , పావురం అక్కడికి వచ్చాయి. అవి మృగరాజుతో "మృగరాజా! ఆ జింక వేటి గురించి కూడా పల్లెత్తు మాట అనదు. అది చాలా మంచిది. ఈ నక్కనే అన్ని జంతువుల గురించి అబద్ధాలు చెప్పి తమకు ఫిర్యాదు చేస్తున్నది. ఈ చీమ చెప్పింది నిజమే!" అని చెప్పాయి. వెంటనే సింహం చీమను అభినందించి ఆ నక్కను మందలించింది .

తర్వాత ఆ చీమ తన నివాస ప్రాంతానికి తిరిగి వచ్చి సింహం తనను అభినందించిన సంగతిని తోటి చీమలకు చెప్పింది. అది నిజమేనని పావురం, చిలుక కూడా వాటితో అన్నాయి. అప్పుడు తోటి చీమలు ఆ చీమ మాటలను నమ్మి అది నిజాన్ని నిర్భ యంగా సింహంతో చెప్పినందుకు దాని ధైర్యాన్ని అభినందించాయి.



**-సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,**
9908554535

## గంజాయి మత్తులో జీవితాలు చిత్తు

అనగనగా ఒక ఊరిలో రామయ్య అనే మధ్యతరగతి కుటుంబం జీవిస్తూ ఉండేది. అతనికి ఒక కొడుకు ఒక కూతురు అతడు వ్యవసాయదారుడు. వ్యవసాయ పనులు చేస్తూ మొదట్లో కుటుంబంతో హాయిగా జీవినం గడిపేవాడు. కానీ ఒకరోజు స్నేహితులతో బయటకు వెళ్ళాడు వారు అతనికి గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు చేశారు దాంతో రామయ్య గంజాయి కి అలవాటు పడ్డాడు. తండ్రిని చూసి చదువుకోవాల్సిన కొడుకు కూడా మత్తు పదార్థాలకు అలవాటు పడ్డాడు. నాన్నను అన్నను చూసి చెల్లి చాలా బాధపడింది. తను వాళ్ళ నాన్నను అన్నను మార్చాలని అనుకొని బాగా చదివి ఏ కలెక్టర్ పోలీసో కావాలని అనుకుంది. వాళ్ళ అమ్మ కూలీకి వెళ్లి ఎండలో కష్టపడి కూతురిని చదివించింది. తను ఏమీ తినకుండా చాలా కష్టపడి వీళ్ళకు మాత్రం తిండి పెట్టేది. నాన్న కొడుకు ఇద్దరూ కలిసి మత్తుకు పూర్తిగా బానిస అయ్యారు. వాళ్ల చెల్లి మాత్రం తాను కలెక్టర్ అయ్యి వాళ్ల నాన్న లాంటి మత్తుకు బానిస అయిన ఎందరినో మార్చాలని నిర్ణయించుకుంది. అనుకున్నట్టుగానే బాగా కష్టపడి చదివి కలెక్టర్ అయింది. ఇలాంటి వాళ్ళ పరిస్థితిని వివరిస్తూ ప్రభుత్వానికి లేఖ రాసింది. అలాగే ఆలేఖను చుట్టుపక్క గ్రామాల్లోకి కూడా పంపించింది .అన్ని ఊర్లలో మత్తు పదార్థాల అమ్మకాలను నిషేధించడానికి ప్రభుత్వ అనుమతి తీసుకుంది. తాను అనుకున్నట్టుగానే వాళ్ళ నాన్న అన్న మత్తు పదార్థాలు సేవించడం మాని మేలుకొని ఎప్పటిలాగే వ్యవసాయం చేస్తూ హాయిగా బ్రతుకుతున్నారు. వాళ్ల చెల్లి అనుకున్నట్టుగానే అమ్మకాన్ని నిషేధించింది. నిషేధించడంతోపాటు వాళ్ళ నాన్న అన్న లాగా ఇతర గ్రామాలలో ఇలాంటి మత్తు పదార్థాలకు బానిస అయిన వారిలో మార్పు తెచ్చింది. వారు వారి పనులు చేసుకుంటూ సంతోషంగా ఆరోగ్యంగా జీవించేటట్లు చేసింది.

**-నీతి:** మత్తు పదార్థాలు జీవితాలను చిత్తు చేస్తాయి.

**-యం.జ్యోత్స్న**
8వ తరగతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
రేగులపల్లి, మం.బెజ్జంకి, సిద్దిపేట

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1433వ రోజు 'రంగస్థలం' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'రంగస్థలం' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.



*మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం*
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
**-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు,** 9441046839

### శ్రమ పొదుగులో జయకేతనం

మనసు పలికే
మౌన రాగాల మనిషి
పాటై ఆటై
పనిలో సేదదీరాడు
మద్దెల దరువు
డప్పు చప్పుళ్ళలో
మునకలేశాడు
శ్రమ పొదుగులో
జయ జయకేతనం
పొద్దు పొడుపైన ఎర్రెర్రని చైతన్యం.
వెట్టి చాకిరి చేసి
వట్టిపోయి
సొమ్మసిల్లిన మనిషి
అలసిపోని దుంకే జలపాతాలతో
పాదాలను జతగా శ్రుతి చేశాడు
వలపోతలను కాచి వడబోసి
తానే పాటై నడిచాడు.
నల్లమబ్బుల చినుకులలో
ఆడే నెమలితో
చిందేసి ఆడి పాడి
పాటకు ప్రాణం పోసి
పాడి పంటల సాగు సొగసులో
బంతి పూల కొలువై జాతర చేశాడు.
శ్రామిక శక్తిలోనే
కంజీర మోగగా
మంజీర నాదాలుగా
నినాదాలు చేయగా
విప్లవాల స్వరూపాలే
వెన్నెల వెల్లువ కాగా
పాలపిట్ట పాటోలె
శ్రమ గీతం పాడగా.
మనసు పలికే
మౌన రాగాల మనిషి
కాలి గజ్జెల సవ్వడిలో
పాటై కై కట్టాడు
ప్రపంచాన్ని చూశాడు
శాంతిని కలగన్నాడు
చితికిన శ్రమ బతుకులలో
కాంతి రేఖలు పూయించాడు.
మనసు పలికే
మౌన రాగాల మనిషి
పాటై ఆటై పనిలో సేదదీరాడు
పనిలో సేదదీరాడు
అవనిని ముద్దాడాడు.

**-ఏడెల్లి రాములు**

### జీవితమే!

నటనసూత్రధారి
మురారిని మించిన నటులం
స్థలం స్వస్థలం వదిలి
భుక్తికై పయనం
అంతటా రంగస్థలం
నాటకం బూటకమంటూ
అసలుసిసలు అభినయం
డైలాగ్స్ హావభావాలతో
ఎక్కడకెళ్తే అక్కడ
వారి భజన గుణగానంచేస్తూ
బైటికి రాగానే
దుమ్మెత్తిపోసే మహానటులం
అందరితో లాలూచీ
పబ్బం గడిపేందుకై
ఇల్లు బైట అలంకరణ తో
పనిలేని రంగస్థలం
ఉదరనిమిత్తం
బహుకృతవేషంతో
అబ్బబ్బో!
మేకప్ లేకుండా బ్రహ్మాండంగా
మనం చెలరేగే రంగ స్థలం ముందు
సినిమా సెట్టింగులు దిగదుడుపు.
స్టేజీపై అలా ఉపన్యాసంతో
నాటకానికి లేపారు తెర
సురభివారి గాత్రంతో నిశబ్దం
నాట్య గాన ఆంగిక వాచికాభినయంతో
ప్రేక్షకులలో
అపూర్వ అలౌకిక ఆనందం
సినిమాల వ్యామోహంతో
రంగస్థలానికి తగ్గిన ఆదరణ
నంది నాటకోత్సవాలు
పరిషత్తు పోటీలతో
సాగుతోంది పయనం.
నేడు దృశ్యం కన్నా
శ్రవణంతో ఆకట్టుకునే
రేడియోనాటకాలు
రంగస్థలంతో
మేకప్ తో పనిలేని
అలరించే సాహిత్య సుమాలు
వసివాడని కుసుమాలు.

**-ఎ.రాజ్యశ్రీ**

### కళారూప ప్రదర్శన

రంగస్థలం
ఒకకళారూప ప్రదర్శన
పేక్షకుల ముందు
ఊహించిన సంఘటన.
నాటక ప్రదర్శన
నాట్య ప్రదర్శన
సంగీత ప్రదర్శన
వాయిద్యాలతో సంగీత ప్రదర్శన.
రంగస్థలం మీద ప్రదర్శన
కళాకారుల ప్రతిభ ఎదగడానికి
పదాల ఉచ్చారణ బాగుపడటానికి
భాషపై పట్టు పెరగడానికి
ఆత్మవిశ్వాసం పెరగడానికి
సృజనాత్మకత పెరగడానికి
ఏకాగ్రత పెరగడానికి
ధైర్యం కలగడానికి
కొత్త ఆలోచనలు రావడానికి
సహనం పెరగడానికి
బంధనాలు ఏర్పడడానికి ఉపయోగం.

**-డా.షహనాజ్ బతుల్**

### రంగస్థలమే శరణ్యం

ప్రతిభావంతులు
కళాకారులు
వాచక నేర్పరులు
రాజకీయవేత్తలు
రాణించి ప్రజారంజకులవ్వాలంటే
సరైన రంగస్థలమే శరణ్యం.
ఆదరణ
ప్రచారం
విశేష శిక్షణ
శోధనల సంధానమే రంగస్థలం.
రాజ దర్బారులు
జమిందారీ ప్రాంగణాలు
విశ్వవిద్యాలయాలు
దేవాలయాలు
స్వచ్ఛంద సంస్థలు
రంగస్థలాల ఏర్పాటుకు ఆధారం.
రంగస్థలాలు
సమాజ,వ్యక్తి నైతిక, మానసిక
ఉల్లాస ఆర్థిక వికాసాలకు
దోహదకారులు.
విదేశీ మోజు
ఎలక్ట్రానిక్ మీడియాలు
చౌకబారు అసభ్య కుట్రలు
రంగస్థలాల మూతకి కారకులు.
మరాఠీ రంగమంచ్
బంగ్లా కళా పరిషత్
త్యాగరాజ మహా సంస్థలు
తెలుగు ప్రాంతాల్లో
స్వచ్ఛంద సంస్థల
అనన్య ప్రయాసల ఫలితమే సినీ రంగం
నేటికీ మన దేశం కళలకు
ప్రతిభలకు రంగస్థలం
సరైన రంగస్థలాల అవకాశం దొరకని
అనేకానేక ప్రతిభావంతులు
తెరచాటై మగ్గిపోతున్నారు,
రంగస్థలాలు విస్తరిస్తే
ప్రతిభలు బూజుపట్టి
మసిబారి అదృశ్యమయ్యే పరిస్థితి రాదు.
ప్రతీ ఇల్లు,బడి,గుడి, ఊరు
రంగస్థలాలుగా మెలగాలి,
రంగస్థలాల వికాసానికి
చేయిచేయి కలపాలి.

**-రాజప్ప**

### శుభం కార్డు పడనిది

ఎవరన్నారు
రంగురంగుల వెలుగులతో
వెలిగేదే రంగస్థలమని
రంగులద్దుకున్న ముఖాలున్నదే
రంగస్థలమని
అవి మాత్రమేనా!
అసలేకావు!.
నిలుచున్న ప్రదేశం
నడుస్తున్న దారి
చుట్టూ ఉన్న ప్రదేశం
మొత్తం రంగస్థలంలోనే ఉన్నాయని
నీముందున్నవారు
నీతో పాటు
ఊపిరి తీసుకుంటున్న వారందరూ
ఆ రంగస్థల నటులేనని
ముఖానికేమీ పులుముకోకున్నా
మారువేషాలేవీ ప్రత్యేకంగా లేకున్నా
రంగస్థల నడిబొడ్డునున్నవాళ్ళే
ఎవరి పాత్రను వారు
అద్భుతంగా పోషిస్తున్నవాళ్ళే.
అమ్మానాన్నల పాత్రధారులు
తోబుట్టువులుగా ఉన్నవారూ
తోడుగా కలిసి బతికేవారు
వారసులుగా పుట్టేవారు
హితులూ స్నేహితులూ
మెచ్చుకునేవారు
విమర్శించేవారు
వారివారి పాత్రల్లో
లోతుగా లీనమై నటిస్తుంటే
వారికనుగుణంగా నటించాల్సిందే
జీవితమనే ఈ రంగస్థలంలో
ఎవరి పాత్ర వారు
అద్భుతంగా పోషించాల్సిందే.
ఎవరికి వారే దర్శకులు
ఎవరికి వారే కథా రచయితలు
శుభం కార్డు ఎన్ని సార్లు పడ్డా
నటీనటులు కొనసాగుతూనే ఉంటారు
రంగస్థలంపై నటన చూపిస్తూనే ఉంటారు
ప్రతి ఒక్కరూ ఉత్తమ నటులుగా
నిరూపించుకుంటూనే ఉంటారు
కనిపించని ఆస్కారును
మించిన అవార్డులు
ఎవరికివారే తీసేసుకుంటారు..

**-గుర్రాల వేంకటేశ్వర్లు**

### మన పాత్రలకు ముఖ్య స్థలం

నాటకం రక్తి కట్టాలంటే
ఆయా పాత్రలు బతికి బట్టకట్టాలంటే
రంగస్థలం తప్పనిసరి.
మనిషి జీవితం ఒక నాటకరంగం
ఆతడో నటుడు
నాటకంలో తనతో మరెన్నో పాత్రలు.
ఒక్కొక్కరి జీవితం
ఒక్కొక్క కథ.
నిజ జీవిత నాటకంలో మరెన్నో
మనిషి మలుచుకున్న కథలు
వాటికి కూడా ఆధారం అవసరం.
నాటకంరక్తి కట్టించి
శాశ్వత కీర్తి పొందే పాత్రలు కొన్నయితే
అర్థాంతరంగా
అర్థంలేని వ్యర్థ పాత్రలుగా
రంగస్థలంపై కనపడి
తప్పుకొనేవి మరికొన్ని.
మన జీవితం నాటక రంగ స్థలమని
మనం నటులమేనని
గుర్తుంచుకొని
మన పాత్రలకు న్యాయం చేకూర్చి
మన మానవత్వాన్ని
పెంచి పోషించుకొంటూ
ఈ జీవిత రంగస్థలంపై
తన పాత్రను
సజీవంగా,సహజంగా
పోషించగలిగిన వాడే
మహానటుడు
నిజ జీవితమైనా
మానవ కల్పిత రంగస్థలమైనా
నాటకం ప్రదర్శించే
ముఖ్యస్థలం రంగస్థలం.
ఎన్నోనాటకాలకది
మూలధనం.

**-డా. సి వసుంధర**

### నేటి రంగస్థలం

స్వచ్ఛమైన మనసులు
ఒకనాడు
నటనలు లేవు
నిర్మలత్వమే జగమంతా
జగమంతా రంగస్థలం ఈనాడు
జగన్నాటక సూత్రధారే దర్శకుడు
రంగుల తెరపై
మాయామోహపు నాటకం
స్వార్థమనే నాటకంలో
పాత్రధారులు
ధనమూలం ఇదం జగత్ అంటూ
డబ్బే సర్వస్వమంటూ సాగుతున్నది
ఆత్మీయత అనుబంధాల్ని తెంచేస్తూ
వ్యసనమొకటి
విశ్వమంతా పరివ్యాపితమై
అధికారమే పరమావధిగా
నేటి రంగస్థలం
నీవు నేర్పిన విద్యయే
నీరజాక్షా అంటూ
మెరుగుల మెరుపుల వస్త్రాలతో
ముఖానికి పులుముకున్నది ఒక రంగు
రంగుల ప్రపంచంలో రంగులు మార్చేస్తూ
ఊసరవిల్లికే కొత్త పాఠాలు నేర్పిస్తూ
నటనలో అపూర్వం అద్వితీయం
నేటి రంగస్థలంపై పోటాపోటీగా నటన
ప్రతిభాపాటవ పత్రం ఎవరికనే మీమాంస!.

**- లక్ష్మారెడ్డి పసుల**

# మౌలిక మార్పులు కోసమే ఓబీసీ మహిళా ఉద్యమాలు

రాజ్యాంగం లో మహిళా రిజర్వేషన్లు చేర్చిన సందర్భంగా ఓబీసీ మహిళలకు అందులో ప్రాతినిధ్యం కల్పించాలని ఓబీసీ మహిళా సెంట్రల్ కమిటీ, అనుబంధ సంఘాలతో పెద్ద ఎత్తున మహా సభ నిర్వహించడం సంతోష దాయకం అని , తన పూర్తి మద్దతు ఉంటుందని సామాజిక తత్వవేత్త తొలి బీసీ కమిషన్ చైర్మన్ బి ఎస్ రాములు అన్నారు. త్వరలో జరిపే ఓబీసీ మహిళా మహాసభకు ముఖ్య అతిథిగా ఆహ్వానించిన సందర్భంగా ఉద్యమం ఎలా శాంతి యుతంగా నిర్వహించాలని ఆయన వివరించారు.

దేశవ్యాప్తంగా జనాభా గణన చేయాలని, పార్లమెంటు అసెంబ్లీ సీట్లను నాలుగు రెట్లు పెంచాలని, బీసీ మహిళలకు డబుల్ బెడ్రూం ఇల్లు, ఇందిరమ్మ ఇల్లు కెటాయించాలని బి ఎస్ రాములు ఈ సందర్భంగా కోరారు. ఓబీసీ మహిళా సెంట్రల్ కమిటీ అధ్యక్షులు యం భాగ్యలక్ష్మి తో మాట్లాడుతూ.. ఇటీవలి కాలంలో రాజకీయాలలో ఆర్థిక వాదం, లౌకిక వాదం, సామ్యవాదం, జీతం భత్యాలు కూలీలు, పెరుగుదల, దున్నే వారికి భూమి, నిరుద్యోగం. ఉద్యోగ భద్రత మొదలైన సిద్ధాంతాల పునాదిపై ఆధారపడిన పార్టీలు రాజకీయాల్లో పూర్తిగా వెనకబ డిపోయాయి. వారి అనైక్యత, అల్ప సంతోషిత్వం. సెల్ఫ్ సెంటర్ వ్యవహారం దీర్ఘకాలిక సమాజ పరిణామాన్ని కుంటు పరిచాయి. ఈ కారణాల వల్ల మధ్యే వాదులు, సామ్యవాదులు, ఆర్థిక , కార్మిక, కర్షక, నిరుద్యోగ , విద్యార్థి వాదులు లౌకిక వాదులు మొదలైన వారి స్థానంలో సాంస్కృతిక వాదం,మత వాదం, కుహనా జాతీయ వాదం, కుహనా దేశభక్తి వాదంముందుకు వచ్చాయి. ఆ ప్రచారం విరివిగా చేస్తూ ఈవియంల టాంపరింగ్‌తో నిజంగా ప్రజలు వోటు వేయడం వల్లనే గెలవడం జరుగుతున్నదని నమ్మే విధానం తఒనసఆదగఉతఉన్నది. దేశాన్ని, బ్యాంకులను అరచేత చిక్కించుకున్న మార్వాడీలు, గుజరాతీలు, బ్రాహ్మణులు, స్వావలంబన కు ప్రాధాన్యత లేని రాజకీయ, సాంస్కృతిక, మత తత్వ భావజాల ఉద్యమాలను నడుపు తున్నారు.

**ఆర్థిక వాదం, లౌకిక వాదం, సామ్యవాదం, జీతం భత్యాలు కూలీలు, పెరుగుదల, దున్నే వారికి భూమి, నిరుద్యోగం. ఉద్యోగ భద్రత మొదలైన సిద్ధాంతాల పునాదిపై ఆధారపడిన పార్టీలు రాజకీయాల్లో పూర్తిగా వెనకబడిపోయాయి. వారి అనైక్యత, అల్ప సంతోషిత్వం. సెల్ఫ్ సెంటర్ వ్యవహారం దీర్ఘకాలిక సమాజ పరిణామాన్ని కుంటు పరిచాయి**

ఈ దశలో బహుజన ఐక్యత అనేది కేవలం సామాజిక నినాదం, రాజకీయ నినాదంగా, భౌతిక శక్తిగా మలుపు తిరగలేక పోతున్నాయి. భారతీయ సాంస్కృతిక వాదంలో ప్రాచీన, ఆర్యాచీన శూద్ర , అతి శూద్ర, ఆదివాసి మూలాలు సాంస్కృతిక వాదాలు సమైక్యం గా ముందుకు సాగడం అవసరం. అనగా మెజారిటీ హిందువులు, మైనారిటీ హిందువులు, వారి వారి సంస్కృతులు, ప్రయోజనాలు వేరు వేరు అని పోలరైజేషన్ ఉద్యమాలు సుదీర్ఘంగా ఆరెస్సెస్ వలెనే పలు సంస్థల నిర్మాణం, కేంద్రీకృత నాయకత్వం తో సాగాలి. జనతా పార్టీ, జనతా దళ్, ప్రయోగాలు, యుపి యే ప్రయోగాలు విఫలమయ్యాయి. ఇండియా ప్రయోగం ప్రారంభం లోనే అడ్డంకులు . అందువల్ల భారత రాజకీయాలు మలుపు తిప్పడానికి , సంపద ఉత్పత్తి , పంపిణీ , సామాజిక సమానత్వం పెరగడానికి సాంస్కృతిక ఉద్యమం తోపాటు, బీసీలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు అనే ఏకైక నినాదం తో ముందుకు సాగడం అవసరం. ఎవరికీ నష్టం లేకుండా అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కోసం చైనాలో వలె, ఆస్ట్రేలియాలో వలె, రష్యా, అమెరికా, బ్రిటన్ లలో వలె పార్లమెంటు సీటు, శాసన సభ సీట్లు పెంచు కోవాలి.

ఈ దేశాల దామాషా ప్రకారం ఐతే చైనాలో 2980 మంది పార్ల మెంటు సభ్యులున్నారు. మన పార్లమెంటు సభ్యులు రాజ్యసభతో కలిపి 3200 వరకు ఉండడం అవసరం.

అలాగే శాసన సభ సీట్లు నాలుగు రెట్లు పెంచుకోవడం అవసరం. సాంస్కృతిక ఉద్యమం ద్వారా ఈ ప్రచారం జరగాలి. రాజకీయ పార్టీలు ఏకగ్రీవ. ఆమోదానికి చేరుకోవాలి. సాంస్కృతిక ఉద్యమం

మన బీసీ మహిళలే ముందుండి నడపాలి. అందు వల్ల బీసీ మహిళలే సాధికారికత ఉద్యమాలు సాంస్కృతిక ఉద్యమంగా సాగాలి.

ఇది ప్రాసెస్ అని భవిష్యత్ ఉద్యమాలలో ఓబీసీ మహిళలదే ప్రధాన పాత్ర అని పేర్కొన్నారు.




బుధవారం కేంద్రసాహిత్య అకాడమీ, శ్రీకృష్ణదేవరాయ భాషానిలయం హైదరాబాద్ సంయుక్తంగా నిర్వహిస్తున్న 'బిరుదురాజు రామరాజు శతజయంతి' కార్యక్రమంలో "బిరుదురాజు రామరాజు సారస్వత వ్యాసములు" పుస్తకావిష్కరణలో లీలావతి( బిరుదు రాజు రామరాజు కూతురు) , వైస్ ఛాన్సలర్ ఆచార్య వెలుదండ నిత్యానందరావు, టి. ఉదయవర్లు, అమ్మంగి వేణుగోపాల్, సి. మృణాళిని.

## మామాడి కాయలు కోస్తూ.. కాలు జారిపడిన యువకుడు

హైదరాబాద్, ఏప్రిల్ 16: మామిడికాయలు కోస్తూ ప్రమాదవశాత్తూ కాలుజారి కింద పడి యువకుడు మృతిచెందిన ఘటన గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నవోదయాకాలనీలో చోటుచేసుకుంది. జలమండలి డివిజన్ 3 కార్యాలయం లో గల వాటర్ ట్యాంక్ మెట్ల మీదనుంచి కిషోర్ (35) మామిడి కాయలు కోస్తూ ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడి మరణించిన సంఘటన ఇవాళ ఉదయం చోటు చేసుకుంది.వివరాల్లోకి వెళితే.. జలమండలి డివిజన్ 3 కార్యాలయంలో స్వీపర్ గా పనిచేస్తున్న సుశీల ఆరోగ్యం బాగలేని కారణంగా తన కొడుకు అరుణ్ స్వీపర్ గా వస్తున్న సమ యంలో దగ్గరి బందువు కిషోర్ వెంట రావడం జరిగిందని తెలిపా రు. ఈ తరుణంలో వాటర్ ట్యాంక్ మెట్లకు ఆనుకొని ఉన్న సుమారు 25 అడుగుల ఎత్తులో పిట్టగోడ ఆసరా చేసుకుని మామిడికాయలు కోస్తున్న సమయంలో కిషోర్ కాలుజారి కింద పడి చనిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమి త్తం మృతుడి బాడిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించడం జరిగిందని పోలీసులు

## సుధీర

పల్లవి::
మనసూ మమత కుసుమలత
విరిసిన బంధపు ప్రేమలత
జీవన యానపు ధీరసుత
ప్రతిభా నిపుణత తన ఘనత
"మనసు"

చరణం::
ప్రేమా స్నేహమె ఆభరణం
ఓర్పు సహనమె తన సుగుణం
కోమల హృదయమె తనకు ధనం
నేర్పరి తనమే తనకు వరం.
"మనసు"

చరణం::
ఆది శక్తికే ప్రియ చెలిగా
అంతము చేయును దుర్మదము
అంతరంగమే నిర్భయమై
నింగికి వేసెను నిచ్చెనలు. "మనసు"

చరణం::
రుద్రమ ఝాన్సీ వారసులై
ధైర్యపు శౌర్యపు మనసిజలై
భీకర సమరపు సైనికులై
ఘర్జన చేసిరి సుధీరలుగా.
"మనసు"

చరణం::
అడుగుఅడుగులో కదిలెడి సుదులను
తడయక దడయక దారులు వెతుకుతు
విజయ తీరమును చేరెడి మహిళలు
ధరణికి వెలుగులు
అవనికి సొబగులు. "మనసు"



-పద్మ త్రిపురారి
సెల్: 965240 8848


**తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ**
మహిళా భారతి - తెలంగాణ సంయుక్త
ఆధ్వర్యంలో...



**డా. శ్రీభాష్యం అనూరాధ**
(తెలుగు అధ్యాపకులు)
"తనబ్బి" - కవితాసంకలనం
పుస్తక ఆవిష్కరణ సభ

తేది.: 18-4-2025, సాయంత్రం 5.30 ని॥లకు
స్థలం : రవీంద్ర భారతి సమావేశ మందిరం
(మొదటి అంతస్తు), హైదరాబాదు

స్వాగతం : డా. శ్రీభాష్యం యదుమోహన్ (యదుగ్రాఫిక్స్ Y8 ఛానల్ అధినేత)
సభాధ్యక్షులు : డా. నాళేశ్వరం శంకరం (అధ్యక్షులు, తెలంగాణ రచయితల సంఘం)
ముఖ్య అతిథి, గ్రంథావిష్కర్త : డా. నందిని సిధారెడ్డి (తెలంగాణ సాహిత్య అకాడమి పూర్వ అధ్యక్షులు)
గౌరవ అతిథి : శ్రీ మామిడి హరికృష్ణ (సంచాలకులు, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ )
విశిష్ట అతిథి : శ్రీ ఎ. కృష్ణారావు (అసోసియేట్ డైరెక్టర్, ఆంధ్రజ్యోతి)
ఆత్మీయ అతిథులు : శ్రీ బైసా దేవదాసు (ప్రధాన సంపాదకులు, నేటి నిజం పత్రిక)
శ్రీ మేక రవీంద్ర గారు (అధ్యక్షులు, సహస్ర కవిసమూహం, తెలుగు అభివృద్ధి సమితి)
శ్రీ చింతపట్ల సుదర్శన్ (విమర్శకులు, రచయిత, కవి)
పుస్తక సమీక్ష : డా. దాసోజు పద్మావతి (మహిళా భారతి అధ్యక్షులు)
వందన సమర్పణ : శ్రీమతి మూర్తి శ్రీదేవి, (ప్రధానకార్యదర్శి, అక్షర కౌముది సంస్థ)

సాహిత్యాభిమానులందరికీ సాదర స్వాగతం!


# గాయపడిన విద్యార్థినిని పరామర్శించిన డీఈఓ రేణుక దేవి

హైదరాబాద్, ఏప్రిల్ 16: ప్రభుత్వ పాఠశాలలోని పైకప్పు పెచ్చులూడి విద్యార్థినిపై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వికారాబాద్ జిల్లా ధరూర్ మండలం మున్నూరు సోమారం ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న శిరీష పై పాఠశాల పైకప్పు పెచ్చులూడి పడి తల, చెవికి, కాళ్లకు గాయాలయ్యాయి. సకాలంలో స్పందించిన ఆ పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలిసి ఆ అమ్మాయిని వికారాబాద్ శారద హాస్పిటల్ కు తరలించగా, డాక్టర్ రాజశేఖర్ ఆ బాలికకు చికిత్సను అందిస్తున్నారు. డీఈఓ రేణుక దేవి బాలికను పరామర్శించారు.

# రక్తం గడ్డ కట్టకపోవడమనే రుగ్మత హీమోఫీలియా !

రక్తస్రావానికి, రక్తం గడ్డకట్టే (బ్లడ్ క్లాటింగ్) లోపానికి సంబంధించిన రుగ్మతగా హీమోఫీలియాను గుర్తిస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా 5 లక్షలకు పైగా ప్రజలు ఈ వ్యాధి బారిన పడినట్లు అంచనా. ప్రమాదకరమైన హీమోఫీలియా వ్యాధితో పాటు ఇతర సంబంధిత వారసత్వ రుగ్మతల పట్ల పూర్తి అవగాహన కల్పించడానికి "ప్రపంచ హీమోఫీలియా ఫెడరేషన్" చొరవతో ప్రతి ఏట 17 ఏప్రిల్‌న "ప్రపంచ హీమోఫీలియా దినం" లేదా "వరల్డ్ హీమోఫీలియా డే"ను పాటించుట 1989 నుంచి ఆనవాయితీగా మారింది. 2025 ప్రపంచ హీమోఫీలియా దినం ఇతివృత్తంగా "అందరికీ అందుబాటులో : మహిళలు, పిల్లల్లో కూడా రక్తస్రావ సమస్య" అనబడే అంశాన్ని తీసుకోని అవగాహన కల్పిస్తున్నారు. ప్రపంచ హీమోఫీలియా ఫెడరేషన్ అనే సంస్థను స్థాపించిన "ఫ్రాంక్ స్నాబెల్" పుట్టిన రోజు 17 ఏప్రిల్‌న ప్రపంచ ప్రపంచ హీమోఫీలియా డే'' పాటిస్తున్నాం. హీమోఫీలియా వ్యాధికి చికిత్సగా రక్తమార్పిడి పద్ధతిని పాటిస్తున్నారు.

**హీమోఫీలియా అంటువ్యాధి కాదు:**

హీమోఫీలియా అంటువ్యాధి కానప్పటికీ హీమోఫీలియా సమస్యగ్నికి ఆజ్యం పోస్తున్నాయి కరోనా లాంటి విపత్తులు. చిన్న గాయం అయినపుడు రక్తం కారడం, కొద్ది సేపటికి గడ్డకట్టడంతో రక్తస్రావం ఆగిపోయి ఆరోగ్యం సమకూరడం జరుగుతుంది. హీమోఫీలియా రుగ్మత కలిగిన వ్యక్తులకు గాయం అయినపుడు రక్తం గడ్డకట్టకుండా రక్తస్రావం కొనసాగి ప్రాణాంతక పరిస్థితి కూడా వస్తుంది. రక్తం గడ్డకట్టే లక్షణాలను విశ్లేషించి హీమోఫీలియాను ఏ, బి రకాలుగా వర్గీకరిస్తారు. ప్రతి 5,000 మందిలో ఒక్కరికి హీమోఫీలియా-ఏ, ప్రతి 20,000 మందిలో ఒక్కరికి హీమో ఫీలియా-బి రుగ్మతలు కనిపిస్తాయి. దాదాపు 80 శాతం హీమోఫీలియా వ్యాధిగ్రస్తులకు ఈ రుగ్మత ఉందని కూడా తెలియక పోవడం విచారకరం. గాయం అయినపుడు రక్తం గడ్డకపోవడం ప్రమాదకరం అని తెలుసుకోవాలి. హీమోఫీలియా వ్యాధిగ్రస్తులకు అంతర్గత గాయాలు అయినపుడు రక్తస్రావం జరిగి మెదడు, కీళ్ళు, కండరాల్లోకి రక్తం చేరి ప్రాణాలు కూడా పోవచ్చని తెలుసుకోవాలి.

భారతంలో దాదాపు 2 లక్షల హీమోఫీలియా రోగులు ఉన్నట్లు, ఇందులో కేవలం 20,000 మందికి మాత్రమే ఈ వ్యాధి ఉందని తెలుసు. నేటికీ హీమోఫీలియా రుగ్మతకు సరైన చికిత్స అందుబాటులో లేకపోవడం సోచనీయం. అనువంశికంగా జీన్ మ్యుటేషన్ కారణంగా తల్లి నుండి పిల్లలకు సంక్రమించగల హీమోఫీలియా వ్యాధి పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండడం కనీస అవసరంగా భావించాలి. గ్రామీణ ప్రజలకు హీమోఫీలియా ఒక శాపంగా మారడం, అంతర్గత/బాహ్య గాయాలు అయిన సందర్భాల్లో పరిస్థితి విషమించి ప్రాణాలు కూడా పోవచ్చని గమనించి తగు జాగ్రత్తలు తీసుకోవ డం మంచిది. సరైన చికిత్స లేని వ్యాధులకు అవగాహనే ఔషధంగా పని చేస్తుంది, ప్రాణాపాయం నుంచి కాపాడుతుంది.

(17 ఏప్రిల్ ''ప్రపంచ హీమోఫీలియా దినం" సందర్భంగా)

-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# కంచ గచ్చిబౌలి భూములపై సుప్రీం ఆదేశాలను స్వాగతించిన కెటిఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 16:కంచ గచ్చిబౌలి భూములపైన సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వాగతించారు. అలాగే కంచ గచ్చిబౌలిలో ధ్వంసం చేసిన అడవులను పునరుద్ధరించాలంటూ సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను అందరూ అభినందించాలన్నారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ ఖాతాలో ట్విట్ చేశారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు రాష్ట్ర చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్‌కు వన్యప్రాణులను కాపాడాలంటూ ఆదేశాలు ఇవ్వడం గొప్ప విజయమన్నారు. వన్యప్రాణుల పట్ల, పర్యావరణ పరిరక్షణకు పాటుపడే ప్రతి ఒక్కరికి దక్కిన విజయం ఇదన్నారు. సుప్రీం కోర్టు ఉత్తర్వులు హైదరాబాద్‌తో పాటు తెలంగాణ పర్యావరణ పరిరక్షణకు గొప్ప ఊతం ఇస్తాయని కేటీఆర్ అభిప్రాయపడ్డారు.

గొంతులేని మూగజీవాల కోసం, చెట్ల కోసం, పర్యావరణం కోసం అండగా నిలబడిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపారు కెటిఆర్ . 400 ఎకరాల కంచ గచ్చిబౌలి అడవిని కాపాడి, హైదరాబాద్ భవిష్యత్తు కోసం నిలబడిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల పట్ల కృతజ్ఞతలు చెప్పారు.

సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన కేంద్ర సాధికారిక కమిటీ ఇచ్చిన సిఫార్సులను కూడా బీఆర్ఎస్ పార్టీ స్వాగతిస్తున్నదన్నారు. కంచ గచ్చిబౌలిని ప్రైవేట్ పార్టీకి తాకట్టు పెట్టిన రేవంత్ ప్రభుత్వ వ్యవహారంలో.. ఆర్థిక అవకతవకలు జరిగే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం చేసిన కేంద్ర సాధికారిక కమిటీ తమ పార్టీ వాదనను బలపరుస్తున్నదని పేర్కొన్నారు. కంచ గచ్చిబౌలి భూముల తాకట్టు విషయంలో పదివేల కోట్ల రూపాయల అవినీతికి రేవంత్ రెడ్డి పాల్పడ్డారని చేసిన ఆరోపణలను కేటీఆర్ పునరుద్ఘాటించారు.

అడవుల పట్ల, వన్యప్రాణుల పట్ల రేవంత్ రెడ్డి నెంబర్ వన్ విలన్‌గా మారారని కేటీఆర్ విమర్శించారు. పర్యావరణ విధ్వంసానికి, పర్యావరణ హత్యకు పాల్పడి తప్పించుకోలేరనే కనీస సోయి రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇకనైనా వస్తుందని కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి తనను తాను మోసం చేసుకున్న విషయాన్ని అర్థం చేసుకుని, పర్యావరణ విధ్వంసం ఆపాలని కేటీఆర్ కోరారు.

## ప్రకృతి పరిరక్షణే ఫస్ట్ .. సుప్రీం ఆదేశాలకు మాజీ ఎంపి సంతోష్ కుమార్ ప్రశంసలు

హైదరాబాద్, ఏప్రిల్ 16: కంచ గచ్చిబౌలి భూములపైన సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలపై గ్రీన్ ఇండియా వ్యవస్థాపకుడు, బిఆర్ ఎస్ పార్టీ మాజీ ఎంపి సంతోష్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు.. ప్రకృతి పరిరక్షణే తొలి ప్రాధాన్యం అంటూ సుప్రీం న్యాయమూర్తులు పేర్కొనడంపై వారికి అభినందనలు తెలిపారు.. ఇప్పటికే ధ్వంసం చేసిన వంద ఎకరాలలో అడవుల పునరుద్దరణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించడం ప్రశంసనీయమన్నారు. ఈ అటవీ పరిరక్షణకు,ప్రకృతి విధ్వంసం కాకుండా కాపాడటంలో కృషి చేసిన ప్రతి ఒక్కరికి సంతోష్ అభినందనలు తెలిపారు.

# తెలుగు భాషా ప్రాభవానికి మండలి కృషి చిరస్మరణీయం



తెలుగు భాషా ప్రాభవానికి మండలి కృష్ణారావు కృషి చిరస్మరణీయమని హై కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ భవానీ ప్రసాద్ కొనియాడారు. రవీంద్రభారతి సమావేశ మందిరంలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ నిర్వహణలో ప్రధాన ప్రపంచ తెలుగు మహా సభలు జరిగి ఏభై ఏండ్లు పూర్తి ఐన సందర్భంగా స్వర్ణోత్సవ సభతో నాటి విద్యాశాఖ మంత్రి మండలి కృష్ణారావు శత జయంతి ఉత్సవ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ భవానీ ప్రసాద్ క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. నాడు కృష్ణారావు చొరవతో ప్రపంచ తెలుగు మహా సభలు నభూతో నభవిష్యత్ అన్న రీతిలో జరిగాయి అని గుర్తు చేశారు. ప్రపంచంలో ఉన్న తెలుగు వారంతా వారం రోజులు హైదరాబాద్ నగరంలో తెలుగు పండుగగా వివిధ సాంస్కృతిక సాహిత్య సేవా కార్యక్ర మాలుతో జరుపుకున్నారని వివరిం చారు. అధ్యక్షత వహించిన ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ వెంకట కృష్ణారావు కొన దివి సీమ తుఫాను సందర్భంలో చేసిన త్యాగ నిరతి నేటికీ అక్కడి ప్రజలు కథలుగా చెప్పుకుంటారని చెప్పారు. ఆయన గొప్ప భాషా ప్రేమికుడు ఆయన వారసత్వాన్ని తనయుడు బుద్ధప్రసాద్ పుణికిపుచ్చుకున్నారని అభినందిం చారు. వేదికపై సారిపల్లి కొండలరావు శాసన సభ్యుడు మండలి బుద్ధ ప్రసాద్, మృదంగ కళాకారుడు ఎల్లా వెంకటేశ్వరరావు, ఆచార్య గౌరీ శంకర్ తదితరులు పాల్గొనగా కిన్నెర రఘురాం నివేదిక సమర్పించారు.

# భూభారతితో అనేక సమస్యలకు పరిష్కారం- కలెక్టర్ కుమార్ దీపక్




ఆదిలాబాద్, ఏప్రిల్ 16: భూభారతి ఆర్.ఓ.ఆర్ కొత్త చట్టం వల్ల అనేక కీలక సమస్యలకు పరిష్కార మార్గం సులభతరమని, నిరుపేద రైతులకు డబ్బులు ఖర్చు లేకుండా త్వరితగతిన భూ సమస్య పరిష్కరించబడుతుందని, మ్యాప్ వేయడం వల్ల మరింత సులభమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ స్పష్టం చేశారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం భూభారతి ఆర్.ఓ.ఆర్ కొత్త చట్టంపై జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.

ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆర్.ఓ.ఆర్ కొత్త చట్టాన్ని రూపొందించిందన్నారు. ఈ చట్టం వల్ల నిజమైన భూమి యజమానికి న్యాయం జరుగుతుందని ఆయన చెప్పారు. తమ పరిధిలో పరిష్కారం కానీ, కోర్టు పరిధిలో ఉన్న భూ సమస్యల పరిష్కారం కోసం నిరుపేద రైతుల కోసం ఈ చట్టం ద్వారా పరిష్కరించడానికి వీలు కల్పించిందని ఆయన చెప్పారు .గతంలో ఉన్న ధరణి స్థానంలో ఈ కొత్త చట్టం రూపొందించారని, దీనివల్ల భూ సమస్యలుంటే చాలా వరకు జిల్లా పరిధిలోనే పరిష్కరించబడతాయని, కొత్త చట్టంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ మోతిలాల్, మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్ రావు, ఏడీ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి కల్పన, స్థానిక తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి, ఎంపీడీవో హుమర్ షరీఫ్, స్థానిక వ్యవసాయ శాఖ అధికారిణి కస్తూరి సంగీత, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, పొనకల్, చింతగూడ సింగల్ విండో చైర్మన్లు అల్లం రవి, నాసాని రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

# ఈత బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పరామర్శ

మహబూబ్ నగర్, ఏప్రిల్ 16 : మహబూబ్ నగర్ మండల పరిధిలోని దివిటిపల్లి సమీపంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల వద్ద రెండు రోజుల క్రితం ముగ్గురు యువకులు క్వారీలో ఈతకు వెళ్లి మృతిచెందిన మృతుల కుటుంబాలను మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ బుధవారం పరామర్శించారు. అంతకు ముందు ఆయన ప్రభుత్వ జనరల్ అస్పత్రిలో మృతదేహాలను పరిశీలించి వెంటనే పోస్టుమార్టం నిర్వహించి కుటుంబాలకు అప్పజెపాలని వైద్యులను కోరారు.

ఈసందర్భంగా విలేకరులతో మాజీ మంత్రి మాట్లాడుతూ.. పట్టణంలో కిరాయి ఇండ్లలో ఉంటున్న పేదలకు మూడు యేండ్ల క్రితం కేసీఆర్ ఆధ్వర్యంలో డబుల్ బెడ్రూమ్ ఇండ్లు నిర్మాణం చేసి ఇచ్చామని, ఇక్కడ నివాసం ఉండి చిన్న చిన్న పనులు చేసుకొని బతుకుతున్న కుటుంబాల్లో అనుకోని విషాదం చోటు చేసుకుందన్నారు. చేతికి వచ్చిన పిల్లలు కుటుంబాలకు ఆసరాగా ఉంటారని అనుకునుకుంటున్న సమయంలో క్వారీ గుంతలో ఈతకు వెళ్లి ముగ్గురు యువకులు మృతిచెందడం ఆ కుటుంబాల్లో తీరని విషాదం నింపిందన్నారు. ఇంతటి ప్రమాదం జరిగి మూడు రోజులు అవుతున్నా పలకరించే నాధుడు లేడని, అసలు ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారా అని ప్రశ్నించారు?? కనీసం జిల్లా అధికార యంత్రాంగం కలెక్టర్? ఎస్పీ కూడా వచ్చి పరామర్శించలేదని మండిపడ్డారు. కలెక్టర్..ఎస్పీ సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతుల కుటుంబాలను పరామర్శించాలంటే ఎవరినుంచైనా అనుమతులు కావాలా అని ఎద్దేవా చేశారు.

చిన్న జిల్లాలు అయితే అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటారని అనుకున్నాం, కానీ అందుకు భిన్నంగా అధికార యంత్రాంగం పనిచేస్తుందని విమర్శించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ వెంటనే స్పందించి ప్రమాద స్థలాన్ని పరిశీలించి మృతుల కుటుంబాలను ఆదుకోవాలని, మళ్ళీ అక్కడ ఇలాంటి ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు చేపట్టి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. లేదంటే మరోసారి ప్రమాదం జరిగితే ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వ సహాయం అందేవిధంగా తన వంతు కృషి చేస్తానని, ఉన్నతాధికారులతో మాట్లాడి బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తానని భరోసానిచ్చారు. ఈకార్యక్రమంలో మాజీ మంత్రి వెంట గ్రంథాలయం సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు దేవేందర్ రెడ్డి, మహబూబ్ నగర్ పట్టణ అధ్యక్షులు శివరాజ్, సీనియర్ నాయకులు రాఘవేందర్ గౌడ్, అంబాదాస్, శివ, రాఘవేందర్, తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో మాజీ ఎమ్మెల్యే లోకనాథ్ మృతి

అమరావతి, ఏప్రిల్ 16:ఏపీలో విషాదం చోటుచేసుకుంది. గుండెపోటుతో మాజీ ఎమ్మెల్యే మృతి చెందారు. ఆలూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే లోకనాథ్ హార్ట్ ఎటాక్‌తో మృతిచెందారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రాత్రి ఆయన తుదిశ్వాస విడిచారు. 1989లో కాంగ్రెస్ పార్టీ తరఫున ఆలూరు నుంచి పోటీ చేసి టీడీపీ అభ్యర్థి రంగన్నపై విజయం సాధించారు. లోకనాథ్ స్వగ్రామం మొలగవల్లిలో అంత్యక్రియలు జరగనున్నాయి. ఆయన మరణం పట్ల పలువురు రాజకీయ నేతలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

# మహనీయుడు బీఆర్ అంబేద్కర్




పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్, కళా జనార్ధనమూర్తి

హైదరాబాద్, ఏప్రిల్ 16: చైతన్యవంతమైన జీవితం దళితులకే కాకుండా శ్రామికులకు కూడా ఉండాలని ప్రణాళికలను రూపొందించిన మహనీయుడు అంబేద్కర్ అని శ్రీ వేంకటేశ్వర యూనివర్శిటీ మాజీ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. మంగళవారం గానసభలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ రచయిత జయసూర్య రచించిన భారతరత్న డా॥ బాబా సాహెబ్ అంబద్కేర్ జీవిత చరిత్ర పునకావిష్కరణ సభ గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది, పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రొ॥ కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ అంబేద్కర్ కేవలం దళితుల పక్షపాతి అని అనుకుంటారని కానీ భారతీయులలో చైతన్యం తీసుకు కావడానికి జనాలందరినీ ప్రేమించిన వ్యక్తిగా ఆయనను గుర్తుంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సంఘసేవకులు భవాని శ్రీనివాసన, కోళ్ల సుధాకర్, పాత శివకుమార్ (జగన్), వీణాపాణి పాల్గొన్నారు.

ఎందరో తెలుగు అభిమానులందరికీ వందనాలు. మేము శ్రీ విశ్వావసు ఉగాది( 2025 )సందర్భముగా నిర్వహించిన పద్య కవితల పోటీలకు విశేషంగా స్పందించిన తెలుగు కవులకు, రచయితలకు ముందుగా ధన్యవాదములు. పోటీకి మొత్తము 286 మంది తమ రచనలను పంపినందులకు సంతోషమైనది .పోటీల ఫలితాల వివరాలు.

## పద్య రచన పోటీ ఫలితాలు

మొదటి బహుమతి -ముదిగొండ శ్రీరామమూర్తి-ఖమ్మం. రెండవ బహుమతి :మాడుగుల మురళీధర శర్మ- సిద్దిపేట. మూడవ బహుమతి:డాక్టర్ కట్టమూరి చంద్రశేఖరమ్ -విజయనగరం

ప్రశంసనీయ రచనలు: 1. కొర్ల వేణుగోపాలరావు ఎల్లారెడ్డిపేట, 2. సిహెచ్ సూర్యనారాయణ రావు-విశాఖపట్నం. 3. పచ్చా పెంచలయ్య మహ్మదాపూర్ నెల్లూరు జిల్లా . 4. బోయిన సంజన (9వ తరగతి) రామంచ. సిద్దిపేట జిల్లా . 5. ఏ .శ్రీనివాస్ (తొమ్మిదవ తరగతి). తొగట హై స్కూలు.సిద్దిపేట జిల్లా

వచన కవిత పోటీ ఫలితాలు: మొదటి బహుమతి: బి కళా గోపాల్, నిజామాబాద్ . రెండో బహుమతి:అవ్వారు శ్రీధర్ బాబు -నెల్లూరు .-మూడవ బహుమతి : కుప్పిలి వెంకట రాజారావు ఆముదాలవలస -శ్రీకాకుళం జిల్లా. ప్రశంసనీయ రచనలు: 1. డాక్టర్ ఎన్ సి హెచ్ .సుధా మైథిలి .గుంటూరు. 2. ఎరుకలపూడి గోపీనాథరావు కోటిపల్లి. కోనసీమ జిల్లా . 3. కె .అబ్రహం లింకన్- ఒంగోలు. 4. సడ్లపల్లె చిదంబర రెడ్డి -హిందూపూర. 5. బిచ్చల బ్లెస్సి (8వ తరగతి) రామంచ హై స్కూల్. సిద్దిపేట జిల్లా.

విజేతలు అందరికీ మా సంస్థ తరఫున హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను.

-రాఘవ మాస్టారు కేదారి, అధ్యక్షులు. హైదరాబాద్/గుడివాడ

# డా॥ వాసా ప్రభావతి స్మారక కవితల పోటీ

సమాజంలో ఉత్తమ విలువలను ప్రోది చేయడానికి సాహిత్యం ఉపకరిస్తుంది. చెడును పరిహరించడం, మంచిని పెంచడం సాహిత్య సృజన లక్ష్యం. మనుషులంతా సమానమేనన్న భావన సమాజంలో పాదుకోవాలన్న ధ్యేయంతో సాహిత్యాన్ని ప్రోత్సహించాలన్నది వాసా ఫౌండేషన్ సంకల్పం. ఈ క్రమంలో భాగంగా ఈ ఏడాది వాసా ఫౌండేషన్ - పాలపిట్ట సంయుక్తంగా కవితల పోటీ నిర్వహించాలని సంకల్పించాయి. మనుషుల్లో మానవీయ సంస్కారాన్ని మేల్కొల్పడం, స్త్రీ పురుష సమానత్వం పాదుకోడం లక్ష్యంగా ఈ కవితల పోటీ ఉంటుంది. డాక్టర్ వాసా ప్రభావతి సంస్మరణార్థం నిర్వహించే ఈ పోటీలో వినూత్నమైన కవితలకు ప్రాధాన్యం ఉంటుంది.

మొదటి బహుమతిః రూ. 3000, రెండో బహుమతిః రూ. 2000, మూడో బహుమతిః రూ. 1000. మరో ఎనిమిది కవితలకు ప్రత్యేక బహుమతులు (ఒక్కొక్క కవితకు రూ. 500)

నిబంధనలు:- సామాజిక చైతన్యానికి తోడ్పడే అంశాలు కవితా వస్తువులుగా ఉండాలి.- సమాజంలో స్త్రీ పురుష సమానత్వానికి బలం చేకూర్చే అంశాలు ఇతివృత్తాలుగా ఉండటం మంచిది. - వస్తుశిల్పాల మధ్య సమన్వయం ఉండాలి. బలమైన అభివ్యక్తి గల కవితలకే పోటీలో ప్రాముఖ్యం ఉంటుంది. - కవితల నిడివికి సంబంధించి ఎలాంటి నిబంధనలు లేవు. అయితే దీర్ఘకవితలు పోటీకి పరిశీలింపబడవు. వచన కవితలు ఎన్ని లైన్లయినా ఉండొచ్చు. - కవితలు తిప్పి పంపడం సాధ్యం కాదు. కనుక ఒక కాపీని మీ వద్ద ఉంచుకోండి. ఎవరయినా ఒకటి లేదా రెండు కవితలు మాత్రమే పోటీకి పంపించాలి. - కవితలు ఈమెయిల్ చేయండి లేదా పోస్టు చేయండి. వాట్సాప్ చేస్తే పరిశీలించడం కుదరదు.- మీ పేరు, చిరునామా విడిగా రాయండి. కవితతోపాటు మీ అడ్రసు ఉండాలి.- పోటీకి పంపించే కవితలు ఎక్కడా ప్రచురితం, ప్రసారమై ఉండ కూడదు. సోషల్‌మీడియాలో పోస్టు చేసి వుండకూడదు.

కవితలు చేరడానికి చివరి తేదీః 30 ఏప్రిల్ 2025. ఫలితాలు ప్రకటించే తేదీః 20 మే 2025. కవితలు పంపించాల్సిన చిరునామాః ఎడిటర్, పాలపిట్ట, ఫ్లాట్ నెంః 3, బ్లాక్-6, ఏపిహెచ్‌బి, బాగ్ లింగంపల్లి హైదరాబాద్-500044 ఫోనుః 9848787284
email: palapittamag@gmail.com

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.